WWW.SAKSHYAM.COM

సత్యం, సమర్థత, విశ్వసనీయత

# సాక్ష్యం

Telangana

తెలుగు దినపత్రిక

హైదరాబాద్
సోమవారం, 30 జూన్ 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.

సంపుటి: 16 | సంచిక: 182
పేజీలు: 08 | వెల: రూ.2:00



## జొన్న బిస్కెట్లు లండన్ వరకు ఎగుమతి

భద్రాద్రి ఆదివాసి మహిళలకు ప్రధాని అభినందన..!
దేశంలో 64% మందికి పైగా సామాజిక భద్రత
ట్రాకోమా రహిత దేశంగా భారత్
మన్‌కీబాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. భద్రాచలంలోని ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట

మిగతా 2 లో..



## ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి

తత్కాల్ టికెట్ల బుకింగ్‌పై నిబంధనలు
రైల్వే మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం
జులై 1 నుంచి నిబంధనలు అమల్లోకి
8గంటల ముందుగానే చార్ట్ సిద్ధం

దేశంలో ప్రతిరోజూ కోటి మంది వరకు రైళ్లలో ప్రయాణిస్తుంటారు. వీరిలో చాలా మంది రిజర్వేషన్లు చేసుకుని ఏ ఇబ్బంది లేకుండా జర్నీ చేయాలనుకుంటారు. . ఎందుకంటే రిజర్వ్

మిగతా 2 లో..



40 ఏళ్ల నిజామాబాద్ రైతుల పోరాటానికి ప్రధాని మోదీ ప్రభుత్వం ముగింపు పలికిందని అమిత్ షా అన్నారు. ఎంపీగా గెలిస్తే పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చిన ధర్మపురి అర్వింద్, మాట నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. "మోదీ ఏది చెబితే అది చేస్తారు. ఈ బోర్డుతో పాటు, భారత్ ఆర్గానిక్, భారత్ ఎక్స్‌పోర్ట్ సంస్థలను కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నాం. ఇకపై నిజామాబాద్ పసుపు ప్రపంచవ్యాప్తంగా తన ఖ్యాతిని చాటుతుంది. రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

### పసుపు పంటకు రాజధాని

# నిజామాబాదు

- నెరవేరిన నాలుగు దశాబ్దాల పసుపు రైతుల కల
- పసుపు బోర్డుపై ఇచ్చి మాట నిలబెట్టుకున్నాం
- ఇక్కడి వ్యక్తినే బోర్డు చైర్మన్ గా నియమించాం
- తెలంగాణలో నాణ్యమైన పసుపు పండుతుంది
- మన పసుపు పంటకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు
- బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వండి: బండి
- జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం

జాతీయ పసుపు బోర్డు ఆఫీసును తన చేతుల మీదగా ప్రారంభించడానికి అదృష్టంగా భావిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. నిజామాబాదులో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆదివారం కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. వినాయక్ నగర్ లో ఏర్పాటుచేసిన జాతీయ పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల పసుపు రైతుల కలను ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారు. పసుపు పంటకు నిజామాబాదు రాజధాని లాంటిది. తెలంగాణ పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని' చెప్పారు. 'తెలంగాణ బిజెపి ఎంపీలు జాతీయ

మిగతా 2 లో..



# వైద్య విద్యార్థుల జీతం 15 శాతం పెంపు

### వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ ప్రభుత్వంతో జూనియర్ డాక్టర్ల చర్చలు సఫలం



ఉద్యోగులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న వారికి భారీగా వేతనాలు పెంచేసింది. 15 శాతం మేర జీతాలు పెంచుతూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఉద్యోగులకు భారీ ఆర్థిక ప్రయోజనం దక్కనుంది. ఇన్నాళ్లు తమ వేతనాల పెంపు కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం అందించిన తీపి కబురు ఇది.వైద్య విద్య

మిగతా 3 లో..

### వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి

# జనగణన

- రెండు దశల్లో నిర్వహించే అవకాశం
- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు సెన్సస్ కమిషనర్ లేఖ
- డిసెంబరు 31 నాటికి సరిహద్దులకు తుదిగడువు

జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. దీనిని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలిదశలో ఇళ్ల జాబితా, వాటి స్థితి, ఆస్తులు, సౌకర్యాలు వంటి వివరాలను సేకరిస్తారు. మలి దశలో జనాభా లెక్కలతో పాటు వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, సంస్కృతి,



సంప్రదాయాలు సహా ఇతర వివరాలను సేకరిస్తారు. తొలిదశ 2026, ఏప్రిల్ 1న ప్రారంభం కానుండగా, రెండో దశ 2027, ఫిబ్రవరి 1న మొదలవనుంది. తొలిదశకు ముందే సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకంతోపాటు వారికి పని కేటాయింపు ప్రక్రియ కూడా

మిగతా 3 లో..

# ఆ ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ..!

### వారికే అధ్యక్ష పదవి ఖాయమని పార్టీలో చర్చ

- పార్టీకి విధేయుడిగా అర్వింద్‌కు గుర్తింపు
- బలమైన బీసీ నేతగా ఈటలకు గుర్తింపు
- నేడు ఇరువురు నామినేషన్ వేసే అవకాశం
- జులై 1న కొత్త బాస్ పై తేలనున్న భవితవ్యం



తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎన్నికపై దాదాపుగా క్లారిటీ వచ్చేసింది. ఇద్దరు నేతల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. అధ్యక్ష పదవికి నామినేషన్ వేసే అవకాశం ఉందంటున్నాయి బీజేపీ వర్గాలు. వీళ్లిద్దరిలోనే ఒకరికి అధ్యక్ష పదవి దక్కవచ్చంటున్నాయి కాషాయ పార్టీ వర్గాలు. ఇక జులై 1న కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటిస్తారు. జూలై 1న కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటన ఉండబోతోందని బీజేపీ నేషనల్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్, ఎంపీ లక్ష్మణ్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిగా ఎవరికి పదవి దక్కబోతోందనే ఆసక్తి బీజేపీ వర్గాల్లో మొదలైంది. అధ్యక్ష పదవి కోసం పార్టీలోని ముఖ్య నేతలంతా ఎవరి స్థాయిలో వాళ్లు ప్రయత్నాలు చేశారు. కానీ సుదీర్ఘ కసరత్తు, అనేక సమీకరణాలు,

మిగతా 2 లో..



## ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి

- 477 డ్రోన్లు, డెకాయ్‌లు, 60 క్షిపణులతో దాడులు
- ధ్వంసమైన ఎఫ్-16 యుద్ధ విమానం

ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి జరిపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ చరిత్రలోనే ఇది అతిపెద్ద దాడి అని అధికారులు తెలిపారు. 477 డ్రోన్లు, డెకాయ్‌లు, 60 క్షిపణులతో రష్యా విరుచుకుపడినట్టు చెప్పారు. అయితే వాటిలో చాలావాటిని కూల్చివేశామని తెలిపారు. ఇంత భారీ వైమానిక దాడి ఎప్పుడూ

మిగతా 3 లో..



## పూరీలో భారీ తొక్కిసలాట..

- ముగ్గురు దుర్మరణం
- 50 మందికి పైగా గాయాలు
- పూరీ కలెక్టర్, ఎస్పీలపై వేటు
- రూ.25 లక్షల నష్టపరిహారం

ఒడిశాలోని పూరీ జగన్నాథుని రథయాత్రలో విషాదం నెలకొంది. ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో శ్రీ గుండిచా ఆలయం ముందు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడానికి తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా,

మిగతా 3 లో..



# 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ'

- 'మేకిన్ ఇండియా' కాదు..
- ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు చర్యలు
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రాలుగా ప్రత్యేక జోన్లు
- మా ఆలోచనలు భవిష్యత్తు తరాల కోసం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు

మేకిన్ ఇండియా' కాదు... 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ నినాదం, లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. తెలంగాణను ఇన్నోవేషన్ హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హైటెక్స్ లో 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఆఫ్ కామర్స్

మిగతా 2 లో..



# సంపాదకీయం

## శాస్త్రీయంగా ఆలోచించాలి

ధర్మో రక్షతి రక్షితః..ఇది భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. ధర్మాన్ని మనం కాపాడితే అది మనలను రక్షిస్తుంది. అలాగే ప్రకృతిని మనం కాపాడుకుంటేనే మనకు మనుగడ ఉంటుంది. భారతీయ సనాతన ధర్మం అంతా ప్రకృతిని పూజించడం, జీవ వైవిధ్యం గురించి వివరించడం జరిగింది. గాలి,నీరు, భూమి, ఆకాశం, అగ్ని అని పంచభూతాలను పూజించాలన్నది అందుకే. అంటే ఇవి మనిషి మనుగడకు తోడ్పడుతాయి కనుక వాటిపట్ల మనం కృతజ్ఞతగా ఉండాలని భారతీయ సంస్కృతి చెబుతోంది. అంటే పూజించడమనే కాదు..రక్షించడం..కాపాడుకోవడం అన్న పరమార్థం ఉంది. చెట్టును, పుట్టను పూజించడం వెనక ఉన్న మర్మం కూడా ఇదే. జీవవైవిధ్యం అనగా భూమిపైగల వివిధ రకాల జీవజాతులను రక్షించుకోవడం. జీవవైవిధ్యం కానాడుకుంటేనే భవిష్యత్ తరాలకు అపారమైన విలువ కలిగిన ఆస్తిని కాపాడిన వారం అవుతాం. అందుకు ప్రధానంగా పంచభూతాలను రక్షించడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతి విధ్వంసం మొదలైన తరవాతనే మానవాళికి ముప్పు ఏర్పడిందని గుర్తించాలి. కరోనాలాంటి వైరస్‌లు వచ్చినా తట్టుకునే స్థితిలో మనం లేమంటే..అందుకు మనం ప్రకృతిని నాశనం చేయడమేని తెలుసుకోవాలి. మానవ తప్పిదాల కారణంగా లేదా విధ్వంసం కారణంగా జీవజాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి జీవవైవిధ్యం నశించిపోతోంది. జీవవైవిధ్యం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, జీవవైవిధ్యంపై ప్రజలలో అవగాహనను పెంచటానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మే22 న 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని' జరుపు కోవాలని నిర్ణయించింది. మనం పూజా పునస్కారాలతో మన ప్రకృతిని కాపాడుకునే ప్రయత్నం చేశాం. దీనిని తరవాతి తరం వారు ఈ పూజలేంటని విస్మరిస్తూ వచ్చారు. అంటే మనకు జీవనాధారంగా ఉన్న ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ వస్తున్నాం. భారతీయ సంస్కృతిలో జీవవైవిధ్యాన్ని పూజించటం, దైవస్వరూపంగా భావించటం గొప్పవిషయం. అందులో భాగంగానే చెట్లు,చేమ, పశుపక్ష్యాదులను పూజించటం జరుగుతోంది. జీవవైవిధ్యంలోని జీవజాతులు వివిధ రకాల సేవలను, ప్రయోజనాలను మానవ జాతికి, పర్యావరణానికి అందిస్తాయి. ఉదాహరణకు మానవులు, ఇతర జీవజాతుల జీవనక్రియలో భూమిపై విడుదల అయ్యే వ్యర్థ పదార్థాలను భూమిలోని సూక్ష్మజీవులు కృశింపచేసి భూమిని సారవంతం చేయుటలో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ పర్యావరణ సేవలను కేవలం సూక్ష్మజీవులు మాత్రమే నిర్వహించ గలవు. జామకాయ, ఆపిల్, ఉసిరి, కూరగాయలు వంటివి ఆహారంగా పనికి వస్తాయి. అదేవిధంగా వేప, తులసి మొదలగువాటిని ఔషధాలుగా ఉపయోగపడుతున్నాయి. వివిధ జీవజాతులు ఒక నిర్దిష్టమైన పనికి లేదా పర్యావరణ సేవలకు ఉపయోగపడతాయి. అదేవిధంగా కొన్ని నిర్దిష్టమైన జంతువులు మాత్రమే మానవులు ఆహారంగా తినటానికి అనువైనవి. ఉదాహరణకు కోడిమాంసం, గొర్రె, పొట్టేలు మాంసం, జలచరాలు అయిన చేపలు మొదలగునవి తినటానికి అనువైనవి. ఇవి ఆరోగ్యానికి మంచిది. మానవ ఆహారం 80 శాతానికి పైగా మొక్కల ద్వారా అందుతోంది. ఆవు పాల ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఆయుర్వేద వైద్య విధానంలో ఆవుపాల ఉత్పత్తులకు విశిష్ట స్థానం కలదు. ముఖ్యంగా చిన్న పిల్లలకి ఆవుపాలు ఎంతో మేలుచేస్తాయి. ఆవు నెయ్యి మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తిని పెంచటమే కాక ముఖ్యమైన విటమిన్లను కలిగి ఉంటుంది. ఆవు పాల ఉత్పత్తుల ను హిందూమత పూజా కార్యక్రమాలలో, శుభ కార్యక్రమాలలో విరివిగా వాడడానికి కారణం ఇదే. భారతీయ సంస్కృతిలో ఆవు ఒక భాగం. ఆవు జీవవైవిధ్యంలో అత్యంత ప్రయోజనకరమైన జంతువు. ఆవు పాలే కాదు దాని పేడ, మూత్రం కూడా ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవవైవిధ్యంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఆవును చంపి మాంసాహారంగా తీసుకోవడం వల్ల మన ప్రకృతిని మనమే ధ్వంసం చేస్తున్నాం. ఆవును పూజించాలన్న ఓ బృహత్తర కార్యక్రమం వెనక కేవలం జీవవైవిధ్య పాత్ర ఉందని చెప్పాలి. ఈ క్రమంలో పశుమాంసానికి అలావాటు పడడం వల్ల వాటి ఉత్పత్తి తగ్గిపోతోంది. పాలు ఇచ్చే సాధు జంతువులు అయిన గేదె,ఆవులు సంఖ్య తగ్గిపోవటం వలన డిమాండ్‌కు తగినవిధంగా పాల ఉత్పత్తి ఉండటం లేదు. జీవవైవిధ్యం నశిస్తే మానవ జాతి కూడా నశిస్తుంది. పర్యావరణ సేవలు, ఆరోగ్య ప్రయోజనాలు, గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్న పశువులను మాంసంగా వినియోగించరాదన్న డిమాండ్ వెనక ఉన్న పరామర్థాన్ని గుర్తించాలి. గోవును పూజించాలన్న పూర్వీకుల ఆచారం వెనక ఎంతటి పరిశోధన ఉందో గమనించాలి. మాంసాహారం తప్పు కాదు. కానీ సమాజానికి అత్యంత అవసరమైన జంతువులను తినడం సరైనది కాదు. ప్రజలు జీవవైవిధ్యానికి ఏది ముఖ్యమో, ఆహారానికి ఏది అవసరమో శాస్త్రీయంగా ఆలోచించాలి. జీవవైవిధ్యం మనుగడ సాగించగలదు. తద్వారా మానవాళి భూమిపై ఆనందంగా జీవనం కొనసాగించగలదు. జీవవైవిధ్య విధ్వంసం వల్లనే కరోనా వైరస్, సార్స్, ఎబోలా వంటి వ్యాధులు జంతువుల నుంచి మానవులకు సంక్రమిస్తున్నాయి. జీవవైవిధ్యం కోల్పోతే లేదా విధ్వంసానికి గురయితే మానవులు ఆరోగ్యంతో సహా అన్నింటినీ కోల్పోతారు. కాబట్టి, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూడరాదు. మానవుని అనాలోచిత చర్యల వల్ల వాతావరణంలో కలుగుతున్న మార్పులు తోడయి, భూమ్మీద నివశిస్తున్న కోట్లాది జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగించుకుంటూ, కలుషితాలను తిరిగి ప్రకృతిలోకి విడుదలచేయటం జరుగుతున్నది. నిత్యం పెద్దయెత్తున్న వెదజల్లబడుతున్న కలుషితాలు, విడుదలవుతున్న కర్బన ఉద్గారాల వల్ల భూవాతావరణం గతంలో ఎన్నడూ లేనంతగా వేడెక్కుతుంది. పెరుగుతున్న భూతాపం, భూమ్మీద నివశిస్తున్న సకల జీవరాశుల మనుగడను తీవ్ర సంక్షోభానికి గురి చేస్తుంది. అందుకే మానవ మనుగడలో అత్యంత కీలకమైన పాత్రను పోషించిన జీవరాశలను రక్షించు కోవాల్సిన భాద్యత సమస్త మానవాళిపైన ఉంది. అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న పర్యావరణ వినాశకర కార్యక్రమాల వల్ల జీవవైవిధ్యం అత్యంత వేగంగా విధ్వంసానికి గురవుతున్నది. దీనికి మనమే రక్షకులుగా నిలవాలి. పర్యావరణాన్ని కాపాడాలి. ప్రకృతిని రక్షించుకోవాలి. అప్పుడే మానవమనుగడ సాగుతుంది.

## ప్రధాని 8 రోజుల విదేశీ పర్యటన

### బ్రెజిల్ బ్రిక్స్ సదస్సులో పాల్గొనే అవకాశం

ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. ముందుగా బ్రెజిల్ లో జరిగే బ్రిక్స్ సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత మోదీ ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియా దేశాల్లో పర్యటించనున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. మొదటగా జూలై 2, 3వ తేదీల్లో ఆఫ్రికా దేశం ఘనా వెళ్తారు. ఆ దేశంలో ప్రధాని మోదీ మొట్టమొదటి సారిగా పర్యటించనున్నారు. కాగా, భారత్ ప్రధాని అక్కడ పర్యటించడం



దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. ఘనా నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు వెళ్తారు. అక్కడ జూలై 3, 4వ తేదీల్లో పర్యటించనున్నారు. 1999 తర్వాత భారత ప్రధాని ఒకరు అక్కడికెళ్లడం ఇదే మొదటిసారి. అనంతరం, జూలై 4, 5వ తేదీల్లో అర్జెంటినా వెళ్తారు. జూలై 5 నుంచి 8 వరకు జరిగే 17వ బ్రిక్స్ సమిట్‌లో పాల్గొంటారు. చివరగా ప్రధాని మోదీ నమీబియా చేరుకుంటారు. నరేంద్ర మోడీ నమీబియాలో పర్యటించే మూడో భారత ప్రధాని గా నిలువనున్నారు. మొత్తంగా ప్రధాని మంత్రి తన విదేశాంగ విధానంలో భాగంగా పలు దేశాల్లో పర్యటిస్తున్నారు. రీసెంట్ గా ప్రధాని మంత్రి జీ 7 సమావేశాల్లో భాగంగా కెనడా దేశానికి వెళ్లారు. అంతకు ముందు సైప్రస్ తో పాటు క్రొయేషియా దేశాలకు వెళ్లారు. మొత్తంగా ప్రధాని మంత్రి తన 11 యేళ్ల పాలనలో మన దేశ ప్రధాన మంత్రులు ఎవరు పర్యటించని ప్రదేశాలకు వెళ్లారు. దీంతో ఆయా దేశాలతో ద్వైపాక్షిక అంశాలకు సంబంధించిన అంశాలపై ఒప్పందాలను కుదుర్చుకున్నారు. అంతేకాదు పలు దేశాలతో చేసుకున్న ఒప్పందాల్లో వాణిజ్యంతో పాటు ఇరు దేశాల్లో నేరస్తుతల అప్పగింత కూడా ఉంది. ఇప్పటికే అమెరికాతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా 26/11 ముంబై ఉగ్రవాద దాడి సూత్రధారి తహవూర్ రాణాను మన దేశానికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే కదా. త్వరలో మెహుల్ చోక్సీ తో పాటు నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లను మన దేశానికి రప్పించే భాగంగా చర్చలు నడుస్తున్నాయి.

## పసుపు పంటకు రాజధాని

# నిజామాబాదు

మొదటిపేజీ తరువాయి..

పసుపు బోర్డు కోసం ఎంతగానో పోరాడారు. కేంద్రం ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డును ఇచ్చి మాట నిలబెట్టుకున్నాం. తెలంగాణకు చెందిన వ్యక్తినే ఆ చేసుకొని 2030 నాటికి ఒక బిలియన్ డాలర్ విలువచేసే పసుపును ఎగుమతి చేయాలి. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కల్పించి అధిక దిగుబడి అయ్యేందుకు చర్యలు దనసరి అనసూయ (సీతక్క), నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'తెలంగాణ భాకాంక్షలు తెలిపారు. 'నిజామాబాద్ జిల్లా వాళ్లు గొప్పోళ్లు. మీరు కొట్లాడి సాధించుకున్నారు. మీరంతా లేచి అమిత్ షాకు ధన్యవాదాలు తెలపాలని కోరుతూ చప్పట్లు కొట్టండి' అని విజ్ఞప్తి




పసుపు బోర్డు కు ఛైర్మన్ గా నియమించాం. ఇక్కడ పండిన పసుపు పంటకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. పసుపు ముఖ్య గుణం ఏంటంటే ఇది మెడిసిన్ గా పని చేస్తుంది. యాంటీ బ్యాక్టీరియా, యాంటీ వైరల్, ఏంటి క్యాన్సర్ కారకంగా పసుపు పనిచేస్తుంది. దాంతోపాటు ఇక్కడ నాణ్యమైన పసుపు పండుతుంది. కనుక డిమాండును సద్వినియోగం చేసుకుని మెరుగైన పంట ఉత్పత్తులు సాధించాలి. జాతీయ పసుపు బోర్డును సద్వినియోగం తీసుకుంటాం. భారత్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా తమ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. పలు రకాల పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించి అన్నదాతలను ఆదుకుంటుంది' అని అమిత్ షా అన్నారు.పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీజేపీ ఎంపీలైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ప్రజలారా.. మీరు అందరికీ ఇచ్చారు అవకాశం. ఈసారి బీజేపీకి ఇవ్వండి అధికారం' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అభ్యర్థించారు. నిజామాబాద్ జిల్లా వాళ్లు గొప్పోళ్లని.. కొట్లాడి పసుపు బోర్డును సాధించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా పసుపు రైతులపై ప్రశంసలు కురిపించారు. పసుపు రైతులు చేసిన ఉద్యమాలు మామూలు కాదని పేర్కొన్నారు. ఎట్టకేలకు పసుపు బోర్డు సాధించుకున్న రైతులకు శుచేశారు. 'ఇందూర్ రైతులు హీరోలు. మీరు చేసిన ఉద్యమాలు మామూలు కాదు. ధర్మపురి అరవింద్‌ను అంతా పసుపు అరవింద్ అంటున్నారు' అని తెలిపారు 'మాది (ఎన్డీయే) రైతు ప్రభుత్వం. రైతును రాజును చేయాలనేది గత నినాదం.. కానీ రైతును రారాజు, మహారాజు చేయాలనేది మోదీ సర్కార్ నినాదం' అని బండి సంజయ్ వివరించారు. 'తెలంగాణ ప్రజల్లారా మీ అందరినీ ఒకటే కోరుతున్నా. అందరికీ ఇచ్చారు అవకాశం బీజేపీకి ఇవ్వండి అధికారం' అని విజ్ఞప్తి చేశారు.

# ఆ ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ..!

మొదటిపేజీ తరువాయి..

వడపోతల తర్వాత.. చివరగా రేసులో ఇద్దరే ఇద్దరు నేతలు మిగిలారు. వాళ్లే ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్. వీళ్లిద్దరిలో ఎవరో ఒకరికి తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఖాయమని పార్టీలో చర్చ జరుగుతోంది. బయటికి చెప్పకపోయినప్పటికీ.. పార్టీలో ఇప్పటికే నిర్ణయం జరిగిపోయిందనీ.. ధర్మపురి అర్వింద్.. లేదా ఈటల రాజేందర్‌లో ఒకరికి పార్టీ పగ్గాలు దక్కబోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే సామర్థ్యం ఉన్న నేతకే పార్టీ పగ్గాలు అప్పగిస్తామని ఎంపీ లక్ష్మణ్ ప్రకటించారు.పార్టీకి విధేయుడిగా ధర్మపురి అర్వింద్‌కు గుర్తింపు ఉంది. ఇక బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షాకు సన్నిహితుడిగాను ఆయన ముద్ర వేసుకున్నారు. తెలంగాణలో బలమైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. సూటిగా విమర్శలు చేయడంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. మిగతా నేతల నుంచి పెద్దగా వ్యతిరేకత లేకపోవడం, బలమైన రాజకీయ నేపథ్యం ఆయనకు కలిసివచ్చే అంశాలుగా భావిస్తున్నారు. అయితే కుటుంబ నేపథ్యం కాంగ్రెస్ కావడం ఆయనకు కొంత మైనస్‌గా భావిస్తున్నారు. జిల్లాకే పరిమితం అవుతారని, రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగత కేడర్ లేపోవడం, దూకుడుగా వ్యవహరించే మనస్తత్వం.. ఆయనకు నెగటివ్ అంశాలు అంటున్నాయి బీజేపీ వర్గాలు.ఇక ఈటల రాజేందర్‌ను తీసుకుంటే.. తెలంగాణలో బలమైన బీసీ నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ఉద్యమ నాయకుడిగా ప్రజాదరణ ఉంది. రాష్ట్ర రాజకీయాలపై పూర్తి పట్టు ఉండడంతో పాటు ప్రత్యర్థి పార్టీల బలాబలాలపై అవగాహన ఉంది. పార్టీలో చేరినప్పుడు అధిష్టానం ఇచ్చిన హామీ కూడా ఆయనకు అనుకూలమైన అంశమే అంటున్నాయి కమలం వర్గాలు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు, తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ సామాజికవర్గ నేత కావడం ఆయనకు పాజిటివ్‌గా మారనుంది. అయితే వామపక్ష భావజాలం ఉన్న ఈటలను %=రా% నేతలు ఎంతవరకు అంగీకరిస్తారో చూడాలి. మొదటినుంచి బీజేపీలో లేకపోవడం కూడా ఆయనకు నెగటివ్ అంటున్నాయి కాషాయ వర్గాలు.ఇక ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. నామినేషన్ వేయాలా వద్దా అనేదానిపై తర్వాత నిర్ణయించుకుంటానన్నారు ఆయన. ఇక ఈటల, ధర్మపురిలో ఎవరు టీ బీజేపీ చీఫ్ అవుతారో చూడాలి.

# 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ'

మొదటిపేజీ తరువాయి..

అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టీసీసీఐ)' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో(ఐఐటీఈఎక్స్) %–% 2025' ముగింపు వేడుకలకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా 25లో ఇండస్ట్రియల్ గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్ రూ.2.77 లక్షల కోట్లకు చేరింది. ఇంధన వినియోగంలో 15.6 శాతం, జీఎస్టీ వసూళ్లలో 9.8, పే రోల్ ఎన్ రోల్ మెంట్స్ లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు' మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. 51వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ , ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్ డెవలప్ చేస్తున్నాం. పారిశ్రామికాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు




హాజరయ్యారు. 'ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేటు 2.9 శాతం. అదే సమయంలో జాతీయ సగటు 0.52 శాతం మాత్రమే. జాతీయ సగటు కన్నా 6 రేట్లు తెలంగాణలో అధికంగా నమోదయింది. 2024–'తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంలో తమ ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చింది. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40వేల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. రూపొందిస్తున్నాం. అవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం' అని శ్రీధర్ బాబు చెప్పారు. 'మేం అయిదేళ్ల కోసం ప్రణాళికలు రూపొందించడం లేదు. రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ దిశగానే అడుగులు వేస్తున్నాం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ కు ధన్యవాదాలు. రాష్ట్రాభివృద్ధిలో కలిసొచ్చే వారందర్నీ కలుపుకుని ముందుకెళ్తాం' అని అన్నారు. 'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(%మీావీజు%)ల బలోపేతంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత 18 నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్ఎంఈలు ప్రారంభమయ్యాయి. మన జీఎస్ డీపీలో ఎంఎస్ ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతేడాది ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశాం. ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఎంఎస్ ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. వీటిల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తాం' అని శ్రీధర్ బాబు చెప్పారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా, ఎఫ్ టీసీసీఐ అధ్యక్షుడు డా.సురేష్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవి కుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## జొన్న బిస్కెట్లు లండన్ వరకు ఎగుమతి

మొదటిపేజీ తరువాయి..

బిస్కెట్లు తయారు చేస్తున్నారని.. అవి హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. అంతేకాకుండా ఈ మహిళలే మూడు నెలల్లో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. భారత జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక



సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని మోదీ వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని గుర్తుచేశారు. శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ-%ఔనూ% నిర్ధరించిందని 123వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు.చాలాకాలం తర్వాత అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందన్న ప్రధాని మోదీ, యాత్రికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన బాబూ జగ్జీవన్ రామ్ వంటి వారిని మనం స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. భారతదేశ సామాజిక పురోగతి, ఆరోగ్య రంగంలో విజయాలు, మహిళా సాధికారతతో పాటు చారిత్రక మైలురాళ్ల గురించి ప్రస్తావించారు. ఇటీవల అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విషయాలను, స్ఫూర్తిదాయకమైన స్థానిక అంశాలు, దేశవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను ప్రధాని మోదీ పేర్కొన్నారు.భారతదేశంలో సామాజిక సంక్షేమం పెరిగిందని హైలైట్ చేశారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ: "అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం దేశ జనాభాలో 64 శాతానికి పైగా, అంటే దాదాపు 95 కోట్ల మంది ఏదో ఒక సామాజిక భద్రతా పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. 2015 నుండి దేశం ఎంతగానో అభివృద్ధి చెందింది. 2015లో కేవలం 25 కోట్ల మంది మాత్రమే సామాజిక భద్రతను పొందారు." అని పేర్కొన్నారు. ప్రధాన ఆరోగ్య విజయాలను సాధిస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. "ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశం ట్రాకోమా నుండి పూర్తిగా విముక్తి పొందినట్లు ప్రకటించింది. ట్రకోమా అనేది శాశ్వత అంధత్వానికి దారితీసే వ్యాధి" అని మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు.

## ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి..

చేసుకున్న కోచ్‌లో ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందుకోసం ప్రయాణికులు కొన్ని రోజులు ముందుగానే ప్లాన్ చేసుకుని టిక్కెట్‌ను బుక్ చేసుకుంటారు. ప్రజలు రైల్వే టికెట్ కౌంటర్ల నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో ఇంట్లో కూర్చుని టిక్కెట్‌లను బుక్ చేసుకోవచ్చు. అయితే జులై 1 నుంచి ఐఆర్‌సీటీసీ టికెట్ బుకింగ్ రూల్స్ మారుతున్నాయి. మనం అకస్మాత్తుగా ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు, తత్కాల్ టిక్కెట్‌లను బుక్ చేసుకుంటారు. భారతీయ రైల్వే తత్కాల్ టికెట్ బుకింగ్‌కు సంబంధించి నిబంధనలను మార్చుతోంది. జూలై 1 నుంచి ఇంతకుముందులా ఈ వ్యక్తులు తత్కాల్ టిక్కెట్‌లను బుక్ చేసుకునే అవకాశం ఉండదు.



## హిందీ తప్పనిసరి నిర్ణయం రద్దు!

### భాషా వివాదంపై వెనక్కి తగ్గిన మహారాష్ట్ర

మహారాష్ట్రలో హిందీ భాషను తప్పనిసరి చేయాలనే నిర్ణయాన్ని ప్రస్తుతానికి నిలిపివేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆదివారం ఈ మేరకు ప్రకటన చేశారు. శివసేన (ఉద్ధవ్ థాకరే), రాజ్ థాకరే పార్టీ ఎంఎన్ఎస్ జూలై 5న ఒకటవ తరగతి నుంచి హిందీని తప్పనిసరి చేయడాన్ని వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఇంతలో మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని నిర్ణయించింది. మహారాష్ట్ర మంత్రివర్గంలోని శివసేన మంత్రులు గులబ్‌రావ్ పాటిల్, శంభురాజ్ దేశాయ్, దాదా భూసే హిందీ భాషను తప్పనిసరి చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్టే ప్రకటించారు. త్రిసూత్రి భాషపై కమిటీ నివేదికను సిద్ధం చేస్తుందని, అప్పటి వరకు దానిని నిలిపివేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రేలతో పాటు అధికార శివసేన నుండి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌పై ఒత్తిడి పెరుగుతోంది. దీని తరువాత, హిందీ భాషా వివాదంపై స్టే విధిస్తామని సీఎం ఫడ్నవీస్ శివసేన మంత్రులకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ విలేకరుల సమావేశం నిర్వహించి తప్పనిసరి హిందీ భాషపై స్టే విధిస్తున్నట్లు



ప్రకటించారు. దీనిపై ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యను నిర్ణయిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత మూడు భాషా సూత్రాన్ని అమలు చేస్తామని తెలిపారు. హిందీ భాషా అంశాన్ని అమలు చేయాలనే నిర్ణయంపై చర్చించడానికి ఆదివారం ప్రత్యేక కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివరణాత్మక చర్చ తర్వాత, మూడు భాషా సూత్రం కింద హిందీ భాషను చేర్చడానికి సంబంధించిన రెండు %+=% లను ప్రభుత్వం రద్దు చేసింది. దేవేంద్ర ఫడ్నవీస్ విలేకరుల సమావేశంలో ఈ సమాచారాన్ని అందించారు.
కేబినెట్ సమావేశం తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, మూడు భాషల సూత్రాలకు సంబంధించి, ఏ తరగతి నుండి మూడవ భాషను అమలు చేయాలి? దీన్ని ఎలా చేయాలి? పిల్లలకు ఏ ఎంపిక ఇవ్వాలి? దీనిపై నిర్ణయం తీసుకోవడానికి, రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. నరేంద్ర జాదవ్ వైస్ ఛాన్సలర్, ఆయన ప్రణాళికా సంఘం సభ్యుడు. ఆయనను విద్యావేత్తగా మాకు తెలుసు. అందువల్ల, ఆయన నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు. అందులో మరికొంత మంది సభ్యులు ఉంటారు. వారి పేర్లను కూడా త్వరలో ప్రకటిస్తామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు.

## జలయజ్ఞంతో మొదలైన ధనయజ్ఞం

### ప్రాజెక్టులు చేపట్టి.. దోచకునే యత్నం
### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులను ఏకకాలంలో చేపట్టి అవి కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు ధనయజ్ఞం లాగా మారిన వైనం చూసాం. అలాగే 2014-15 నుండి 2018-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరంతో కలిపి 56 సాగునీటి ప్రాజెక్టులను రూ.80,792 కోట్లతో పూర్తి చేస్తామని చెప్పి వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా మరో 37 ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించి 4 సంవత్సరాల్లో పూర్తిచేస్తామని ప్రకటించి రూ.61,573.15 కేటాయించి, అందులో రూ.32,059,61 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తయితే భారీ ప్రాజెక్టుల ద్వారా 580.692 టిఎంసీల నీటితో 50,95,394 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 25.111 టిఎంసీల నీటితో 2,82,238 ఎకరాలు, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 3.742 టిఎంసీల నీటితో 58,052 ఎకరాలు మొత్తం 54,35,684 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బనకచర్ల ప్రాజెక్టు గురించి అధికార పార్టీ మాట్లాడినా, ప్రతిపక్షం ప్రశ్నించకపోయినా ప్రజలు ప్రశ్నించాలి. కేంద్రం ఆరా తీయాలి. ఎందుకంటే ఇది సాధ్యమా కాదా అన్నది ముందు తేల్చాలి. కెసిఆర్ లాగా చంద్రబాబు చేస్తానంటూ చూస్తూ ఊరుకోరాదు. బనకచర్ల ప్రాజెక్టును మూడు దశల్లో నిర్మించాలని నిర్ణయించినట్లు సిఎం చంద్రబాబు చెబుతున్నారు. మొదటి దశలో ప్రస్తుతం వున్న పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని 17,500 నుండి 38,000 క్యూసెక్కులకు పెంచుతారు. పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్ల ఎత్తుకు కుదిస్తూ కేంద్ర కేబినెట్ గత ఆగస్టులో తీర్మానించింది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించలేదు. 41 మీటర్ల వరకే నీరు వుంటే 42 మీటర్ల నుంచి బనకచర్ల ప్రాజెక్టుకు నీరు తరలిస్తామనడం ఎలా సాధ్యం? అలాగే రెండో దశలో కొత్తగా పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి దగ్గర 150 టిఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్ నిర్మించాలి. దీనివల్ల బొల్లాపల్లి మండలంలో 15 గ్రామాలు నీటి మునుగుతాయి. వీరికి పునరావాసం కల్పించాలి. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకే ఇప్పటికీ పరిహారం, మౌలిక సౌకర్యాలు కల్పించక పోవడంతో వారు పోరాడుతున్నారు. కొత్తగా ఈ 15 గ్రామాల పునరావాసం ఎప్పటికి తీరుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయర్‌లో 172 మీటర్ల నుండి 300 మీటర్లకు ఎత్తిపోసి, నల్లమలలో తవ్వే టన్నెళ్ల ద్వారా బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించాలి. బనకచర్ల మొత్తం ప్రాజెక్టు ఖర్చులో ఈ మూడో దశ పనులకే దాదాపు సగం ఖర్చు అవుతుంది.

మొదటి, రెండు దశలతో పోలిస్తే మూడో దశ పని క్లిష్టమైంది. బనకచర్ల ప్రాజెక్టును సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటున్నారు. అంటే నీటిపారుదల శాఖ సిబ్బంది వేతనాలు, ప్రాజెక్టు నిర్వహణకు అయ్యే ఖర్చును రైతులే భరించాలేమో! ప్రస్తుత ఖర్చుల ప్రకారం ఎకరాకు యాభై వేల రూపాయలను రైతులు చెల్లించాలి. ఇది ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పెరగడమే తప్ప తగ్గే సమస్యే లేదు. దాదాపు ఉచితంగా సాగునీరు ఇస్తేనే పండిన పంట గిట్టుబాటు కాక ప్రాజెక్టులో నీరు వున్నప్పటికీ ధాన్యం పడించడానికి రైతులు సిద్ధపడని స్థితిలో ఇంత ఖర్చును భరించడం వ్యవసాయదారులకు సాధ్యమా? ఈ మాత్రం ఆలోచన పాలకులకు తెలియక కాదు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయాన్ని అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే విధానాన్ని గతంలో జగన్ మోహన్ రెడ్డి, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ద్వారా అమలు చేయించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అటు విద్యుత్ చార్జీలు, ఇటు సాగునీటి ఖర్చులను పేద రైతులే కాదు, మధ్యతరగతి రైతులు కూడా భరించడం సాధ్యం కాదు. ఇప్పటికే రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి పేరుతో 11 లక్షల ఎకరాల భూమి కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పోతుంది. రానున్న రోజుల్లో బనకచర్ల లాంటి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుల ద్వారా మరికొన్ని లక్షల ఎకరాల భూమి ఈ కంపెనీల చేతుల్లోకి వెళ్తుంది. అందువల్ల ముందుగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలి. జలయజ్ఞం పేరుతో చేపట్టిన ధనయజ్ఞానికి చెల్లుచీటి పలకాలి.

## వైద్య విద్యార్థుల జీతం 15 శాతం పెంపు

మొదటిపేజీ తరువాయి..



చదువుతూనే వైద్యులుగా పని చేస్తున్న మెడికోలకు తెలంగాణ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించింది. మెడికోలకు భారీగా స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 15 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. మెడికల్, డెంటల్ స్టూడెంట్స్‌తో పాటు, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనం కూడా ప్రభుత్వం పెంచేసింది. స్టైఫండ్ పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ పెంపుతో వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా తమ స్టైఫండ్, గౌరవ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తుండగా ఇప్పుడు ప్రభుత్వం కరుణించింది. 15 శాతం పెంపుతో మెడికోలు, పీజీ డాక్టర్లు, సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లకు ఊరట లభించింది. ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వాని కృతజ్ఞతలు చెబుతున్నారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జనగణన

మొదటిపేజీ తరువాయి..


పూర్తి చేయనున్నారు. ఈ మేరకు జన గణన విభాగం కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ పేర్కొన్నారు. ఆయా వివరాలతో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఈ ప్రక్రియకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహకరించాలని కోరారు. జన గణనతోపాటే కుల గణను కూడా చేపట్టనున్నట్టు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో దానిని కూడా మలిదశలో చేపట్టనున్నారు. కాగా, దేశంలో జనగణన చేపట్టడం ఇది 16వ సారి అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేపడుతున్న 8వ జనగణనగా మృత్యుంజయ్ కుమార్ పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియను మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. జిల్లాలు, తాలూకాలు, పోలీసు స్టేషన్ల సరిహద్దుల నిర్ణయాన్ని ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి ముగించాలని మృత్యుంజయ్ కుమార్ సూచించారు. డిసెంబరు 31నాటికి ఉన్న



సరిహద్దులను జన గణనకు ప్రామాణికంగా తీసుకుంటామని వివరించారు. గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాకులా విభజించనున్నట్టు తెలిపారు. ఒక్కొక్క బ్లాకుకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నట్టు పేర్కొన్నారు.

## 2027లోగా పోలవరం పూర్తి

మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెడుతూ,



టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పనితీరు బాలా లేకుంటే ఉపేక్షించేది లేదని.. ఇక వాళ్లకు గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఎన్ని సమస్యలు ఎదురైనా నిలదొక్కుకున్నామని.. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. మళ్లీ తాయు అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తామని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్ర సుపరిపాలనలో తొలి అడుగు వేశామని సీఎం అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. చేసిన పనిని ప్రజలకు చెప్పడం ముఖ్యమని.. భవిష్యత్తులో ఏం చేస్తామో కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని చంద్రబాబు అన్నారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. అందులో భాగంగానే బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు రూ.15వేల నిధులు కేటాయించారని తెలిపారు. పోలవంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులకు కేంద్రం నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ క్రమంలోనే ఏడాదిన్నరలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. 2027 లోగానే ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు కూడా కేంద్రం రూ.11,400 కోట్లు మంజూరు చేసిందని చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి గైర్హాజరైన 15 మంది ఎమ్మెల్యేలు విదేశాల్లో ఉండటంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల్లో ప్రజలకు దూరంగా ఉండటం సరికాదని సమావేశం ముగింపు సందర్భంగా గట్టిగా హెచ్చరించారు. ఆహ్వానితుల్లో 56మంది గైర్హాజరయ్యారని సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఉదయం ఎంత మంది వచ్చారు, సంతకాలు పెట్టి ఎంత మంది వెళ్లిపోయారు, సమావేశం చివరి వరకూ ఎంత మంది ఉన్నారో అందరి లెక్కలు తన వద్ద ఉన్నాయన్నారు. ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. గైర్హాజరుకు కారణాలు అడిగితే కొందరు విదేశీ పర్యటనలు అన్నారు, ఇంకొంతమంది దైవ దర్శనాలు అని సమాధానం ఇచ్చారని నేతల గైర్హాజరుపై చంద్రబాబు చురకలు అంటించారు. పార్టీ కార్యక్రమాలకంటే ఇతరత్రా ఎక్కువయ్యాయా అని నిలదీశారు. దేవాలయ సందర్శనలు మరో రోజు పెట్టుకోవచ్చు కదా అని అభిప్రాయపడ్డారు. తరచూ విదేశీ పర్యటనలు పెట్టుకునేవారు ఇక ఫారిన్‌లోనే ఉండటం మంచిదని హితవు పలికారు. తానా, ఆటాలకు టిక్కెట్లు బుక్ చేసుకున్న వారి జాబితా కూడా తన వద్ద ఉందని నేతలతో సీఎం అన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తెలుగుదేశం విస్తృత స్థాయి సమావేశం సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది.

## సర్వీస్ ట్యాక్స్‌పై వెనక్కి తగ్గని కెనడా

### కెనడాతో వాణిజ్య చర్చలు ముగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన

కెనడా విధిస్తున్న డిజిటల్ సర్వీస్ ట్యాక్స్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కీలక ప్రకటన చేశారు. ఈ డిజిటల్ సర్వీస్ ట్యాక్స్‌పై కెనడా వెనక్కి తగ్గకపోవడంతో ఆ దేశంతో అన్ని రకాల వాణిజ్య చర్చలు ముగిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. ఈ మేరకు తన సొంత




సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్‌లో సంచలన ప్రకటన చేశారు. 'కెనడాతో అన్ని రకాల వాణిజ్య చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నాం' అని ప్రకటించారు. కెనడలో డిజిటల్ సేవల పన్ను గతేడాది అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే, కంపెనీలు మాత్రం ఈ ఏడాది జూన్ 30 నుంచి పన్ను చెల్లింపులు ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. ఈ చట్టం ప్రకారం.. కెనడాలో ఆన్‌లైన్ ద్వారా గణనీయమైన ఆదాయం అర్జించే పెద్ద డిజిటల్ కంపెనీలు తమ ఆదాయంపై 3 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్ సేవలు, ఆన్‌లైన్ ప్రకటనలు, సోషల్ మీడియా సేవలు, వినియోగదారుల డేటా అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఈ పన్ను పరిధిలోకి వస్తుంది. ఈ విధానం యూఎస్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన పెద్ద పెద్ద టెక్ కంపెనీలు, ఇ-కామర్స్ ఎ÷-లాట్‌ఫామ్‌లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. దీంతో అధ్యక్షుడు దీనిపై ప్రధానంగా దృష్టి సాధించారు. జూన్ 30 నుంచి ఈ కొత్త పన్నుల విధానం అమల్లోకి రానున్న నేపథ్యంలో ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి

మొదటిపేజీ తరువాయి..

జరగలేదని ఉక్రెయిన్ వైమానిక దళ కమ్యూనికేషన్స్ హెడ్ యూరీ ఇన్నాట్ తెలిపారు. ఇస్తాంబుల్‌లో జరిగే ముఖాముఖీ శాంతి చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించిన మరునాడే ఈ భారీ దాడి జరగడం గమనార్హం. తాజా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అమెరికా మద్దతు, సహాయాన్ని కోరారు. 'దురాక్రమణదారుడిపై ఒత్తిడి అవసరం. అలాగే రక్షణ కూడా అవసరం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకోమని ఇజ్రాయెల్‌ను కోరారు. యుద్ధాన్ని ముగించి, సంధి కుదుర్చుకోవాలని అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ లో పోస్ట్ పెట్టారు. గాజాలో ఒప్పందం చేసుకోండని, బందీలను వెనక్కి తీసుకురండని పేర్కొన్నారు. అయితే ట్రంప్ ఇప్పటికే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించారు. దాన్ని ఇప్పుడు ఆమోదించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ఆయన ఒత్తిడి తెచ్చినట్లైంది. అయితే గాజాలో వచ్చేవారం సంధి




కుదురుతుందని తొలుత ట్రంప్ ప్రకటించారు. అక్కడికి కొన్ని గంటల్లోనే మరోసారి సోషల్ మీడియాలో ఒప్పందం కుదుర్చుకోమని పోస్ట్ పెట్టారు. అదే సమయంలో నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ పోస్టును పెట్టడం విశేషం. గత బుధవారం ట్రంప్, సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇజ్రాయెల్ ప్రధానిపై కేసులు కేవలం వేధింపులు అనే అర్థం వచ్చేట్లు పోస్టు పెట్టారు. అక్టోబర్ 7వ తేదీ హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసి వందల మందిని హత్య చేసింది. 251 మందిని బందీలుగా పట్టుకుపోయింది. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. 49 మంది ఇప్పటికీ హమాస్ చెరలోనే ఉన్నట్లు సమాచారం.

## పూరీలో భారీ తొక్కిసలాట..

మొదటిపేజీ తరువాయి..


10 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారిని వెంటనే పూరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన శ్రీ గుండిచా ఆలయం ముందు శారదాబలి సమీపంలో జరిగింది. ఆ సమయంలో రథంపై కూర్చున్న జగన్నాథుడిని దర్శనం చేసుకోవడానికి భారీ జనసమూహం గుమిగూడింది. దర్శన సమయంలో జనసమూహాన్ని నియంత్రించడం కష్టమైంది. భక్తులు తోసుకోవడంతో ఈ తొక్కిసలాట జరిగింది. ముగ్గురు వ్యక్తులు జనసమూహంలో చిక్కుకుని అక్కడికక్కడే మరణించారు. మృతులందరూ ఖుర్దా జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ప్రభాతి దాస్, బసంతి సాహు, ఒక పురుషుడు 70 ఏళ్ల ప్రేమకాంత్ మహంతి ఉన్నారు. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల బృందం వారికి నిరంతరం చికిత్స అందిస్తోంది. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పూరీ జగన్నాథ రథయాత్ర దేశంలోని అతిపెద్ద మతపరమైన యాత్రలలో ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల దర్శనం కోసం పూరీకి చేరుకుంటారు. రథయాత్ర సమయంలో శ్రీమందిర్ నుండి బయటకు తీసుకువచ్చి శ్రీ గుండిచా ఆలయానికి తీసుకువెళతారు. అక్కడ ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటారు. ఈ ఊరేగింపు సమయంలోనే తొక్కిసలాట జరిగింది.



## ఉత్తరాఖండ్‌లో కుండపోత

### ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు
### యాత్ర నిలిపివేత, పలు మార్గాలు మూసివేత

దేవభూమి ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానల కారణంగా జనజీవనం స్తంభించింది. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చార్‌ధామ్ యాత్రను 24 గంటల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుజాగ్రత్త చర్యగా చార్‌ధామ్ యాత్రను నిలిపివేస్తున్నట్లు గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే మీడియాకు తెలిపారు. హరిద్వార్, రుషికేశ్, శ్రీనగర్, రుద్రప్రయాగ్, సోన్‌ప్రయాగ్, వికాస్‌నగర్ వంటి కీలక ప్రాంతాల్లో యాత్రికులను సురక్షిత ప్రాంతాల్లో ఆపివేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరిస్థితులు చక్కబడే వరకు యాత్రికులు ఎక్కడివారు అక్కడే ఉండాలని ఆయన సూచించారు. వర్షాల కారణంగా పలు ప్రధాన రహదారులు మూతపడ్డాయి. చమోలీ జిల్లాలోని నందప్రయాగ్ భానర్పానీ వద్ద కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ జాతీయ రహదారిని మూసివేసినట్లు జిల్లా పోలీసులు ప్రకటించారు. యాత్రికులు, స్థానికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ భరోసా ఇచ్చారు. ఈ పరిణామాలపై స్పందించిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.




# ఖగోళంలో ఏం జరుగుతోంది..

## ★వందేండ్ల క్రితం కనిపించిన ప్లానెట్ 9 ఏమైపోయింది?

ఈ నేల నాది, ఈ ఇల్లు నాది అనుకునే భావనల నుంచి కాస్త బయటకు వచ్చి చీకటివేళ ఆకసాన్ని చూస్తే, పలకరిస్తున్నట్టుగా మిణుకుమిణుకుమనే తారలు. వాటి మధ్య సొట్టబుగ్గలతో జాబిలి, ఆ జాబిలికి కాస్త దూరంగా స్థిరంగా కాంతిని ప్రతిఫలించే గ్రహాలు. ఇప్పుడంటే నేల మీద పరుగులు పెరిగి, నింగి వంక చూసే తీరిక, ఓపిక ఉండటం లేదు కానీ ఒకప్పుడు ఆకాశం వంక చూడటం, గ్రహగతులను గమనించడం చాలామందికి తెలిసిన విద్యగానే ఉండేది. అలా చూస్తూనే గ్రహాలను, నక్షత్రాలను వేర్వేరుగా గుర్తించారు. మన సౌరకుటుంబంలో ఉన్న బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు, గురుడు, శని గ్రహాలను కేవలం కంటి చూపుతోనే కనిపెట్టారు అంటే ఆశ్చర్యంగా ఉండ వచ్చు. యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోలను మాత్రమే టెలిస్కోప్ సాయంతో కనుగొన్నారు. వాటిలో ప్లూటో.. గ్రహం హోదాను కోల్పోయాక నవగ్రహాలు కాస్తా అష్టగ్రహ కూటమిగా మిగిలిపోయాయి. కథ ఇక్కడితో ఆగలేదు. నెప్ట్యూన్ ఆవల ఓ భారీ గ్రహం ఉందనే వార్తలు ఆసక్తి కలిగిస్తున్నాయి. ఆ గ్రహపు స్థితిగతుల మీద కచ్చితమైన సమాచారం లేకపోయినా దాని ఉనికి మీద మాత్రం సందేహాలు వీడిపోతున్నాయి.అంతరిక్షంలో ఏం జరుగుతున్నదో, ఆకాశంలో ఎక్కడ ఏముందో తెలుసుకునేందుకు ఇప్పుడు సవాలక్ష మార్గాలున్నాయి. కానీ ఒకప్పుడు కేవలం కంటిచూపు, మస్తిష్కంలో సాగే విశ్లేషణలు, తాళపత్రాల మీద లెక్కలే ఆధారంగా ఉండేవి. టెలిస్కోప్ వచ్చాక, ఆవిష్కరణల వేగం పుంజుకుంది. హాన్స్ లిపర్షే అనే డచ్ అద్దాల వ్యాపారి, 1608లో టెలిస్కోప్‌ను కనుగొన్నాడు. దాన్ని గెలీలియో ఖగోళ పరిశోధనకు అనువుగా మార్చాడు. అయినా ఓ కొత్త గ్రహాన్ని కనుగొనడానికి దాదాపు రెండు శతాబ్దాలు పట్టింది. విలియమ్ హర్షల్ అనే శాస్త్రవేత్త 1781లో యురేనస్ గ్రహాన్ని కనిపెట్టాడు. దాంతోపాటే కొన్నివేల ఖగోళ పదార్థాలనీ కనిపెట్టాడు హర్షల్. అప్పటిదాకా ఆరు గ్రహాల జాబితానే వల్లె వేస్తున్న పిల్లలు యురేనస్ పేరును బట్టీపట్టసాగారు.

సౌర కుటుంబంలోకి కొత్తగా చేరిన ఈ యురేనస్‌ను గమనించేందుకు ఖగోళ శాస్త్రవేత్తలంతా తమ టెలిస్కోప్‌లను ఆ దిశగా ఎక్కుపెట్టారు. అయితే దాని భ్రమణాన్ని పరిశీలించినవారికి ఏదో తేడా కనిపించింది. దాని ఆవల ఉన్న మరో వస్తువేదో యురేనస్ గతిని ప్రభావితం చేస్తున్నట్టు అనిపించింది. ఆ లెక్కల ఆధారంగా యురేనస్ అవతల గమనించినప్పుడు నెప్ట్యూన్ బయటపడింది. గ్రహాల జాబితా పెరిగింది. నెప్ట్యూన్ తర్వాత కూడా మరో గ్రహం ఉంది అనే అనుమానానికి కూడా ఈ సిద్ధాంతమే కారణం. నెప్ట్యూన్ గతిని మరో గ్రహమేదో ప్రభావితం చేస్తున్నది అనుకున్నప్పుడు అది ప్లూటో ఏమో అనుకున్నారు. కానీ ప్లూటోకి అంత శక్తి లేదని తర్వాత అర్థమైపోవడంతో మరో గ్రహం కోసం అన్వేషిస్తున్నారు.

### పేరు లేని గ్రహం కోసం

వందేండ్ల క్రితమే లోవెల్ అనే శాస్త్రవేత్త నెప్ట్యూన్ ఆవలి గ్రహానికి, ప్లానెట్ X అని పేరు పెట్టాడు. అమెరికాకు చెందిన ఈ లోవెల్ చిత్రమైన మనిషి. రచయిత, వ్యాపారవేత్త, గణిత శాస్త్రవేత్త అయిన లోవెల్ కుజగ్రహం మీద కనిపించే చారలను ఆనకట్టలుగా భావించాడు. ఆధునిక నాగరికతకు చెందినవారు అక్కడ ఉంటూ, ఆ ఆనకట్టలను నిర్మించారని నమ్మాడు. తన నమ్మకాన్ని ప్రచారం చేస్తూ ఏకంగా మూడు పుస్తకాలు రాశాడు. నెప్ట్యూన్ ఆవల ఓ మార్మిక గ్రహం ఉందనీ, దాని పేరు ప్లానెట్ ఎక్స్ అనీ చెప్పుకొచ్చాడు. లోవెల్ మాటల్ని ఎవరూ ఖాతరు చేయలేదు కానీ, ప్లానెట్ ఎక్స్ అన్న పేరు మాత్రం స్థిరపడిపోయింది.తర్వాత కాలంలో దీని గురించి విస్తృతమైన పరిశోధనలు చేసిన బ్రౌన్, బెటిజిన్ అనే శాస్త్రవేత్తలు ఈ గ్రహానికి పెర్ట్యుబర్, జార్జ్ లాంటి రకరకాల పేర్లు సూచించారు. నెప్ట్యూన్ ఆవల ఉన్న ఖగోళ వస్తువులన్నిటినీ కూడా ట్రాన్స్ నెప్ట్యూనియన్ ఆబ్జెక్ట్స్ పేరుతో పిలుస్తున్నారు.

వాటిలో ఈ గ్రహమూ ఒకటి. ఖగోళంలో ఓ వస్తువు ఉనికిని స్పష్టంగా నిరూపించేంతవరకు దానికి పేరు పెట్టేందుకు అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య ఒప్పుకోదు. కాబట్టి ఈ గ్రహానికి ఇంతవరకు ఏ పేరూ స్థిరపడలేదు. ప్రస్తుతానికి ప్లానెట్ 9 పేరుతో శాస్త్రవేత్తలు దీని గురించిన సమాచారాన్ని పంచుకుంటున్నారు.

### ప్లానెట్ 9 ఎలా ఆవిర్భవించింది

ప్లానెట్ 9 ఎలా ఏర్పడింది అనే విషయం మీద అనేక సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి.

1 ఓ అంచనా ప్రకారం మొదట్లో ఈ గ్రహం గురుడు, శని లాంటి భారీ గ్రహాలకు దగ్గర్లో ఉండేది. వాటి గురుత్వాకర్షణ శక్తి వల్ల ఏ ఇతర గ్రహం కూడా, ఆ మార్గంలోకి రాకుండా ఉంటాయి. అలా ప్లానెట్ 9, క్రమంగా పెద్ద గ్రహాల నుంచి తప్పుకొని, దూరంగా వెళ్లిపోయిందని అంటారు.

2 మరో సిద్ధాంతం ప్రకారం ప్లానెట్ 9, ఇతర నక్షత్రానికి చెందిన గ్రహం. కానీ సూర్యుడి ఆకర్షణ వల్ల, మన సౌర కుటుంబంలోకి వచ్చి చేరింది.

3 వాయువులు, ధూళికణాల కలయికతో అక్కడికక్కడే ఈ గ్రహం ఏర్పడిందని మరో ఊహ.

4 సౌర కుటుంబం ఏర్పడే సమయంలో ఇతర గ్రహాల్లాగానే ఈ ప్లానెట్ 9 ఏర్పడిందనీ, అయితే ఓ గ్రహంగా రూపాంతరం చెందకుండానే అసంపూర్ణంగా మిగిలిపోయిందనీ ఇంకో మాట.

### వలయంలో కలవరం

సౌర కుటుంబంలో గ్రహాలన్నీ ఏర్పడిపోయాక మిగిలిన శకలాలన్నీ ఒక వలయంలా ఏర్పడి తిరుగుతున్నాయి. వాటిని కనుగొన్న శాస్త్రవేత్త పేరుమీదుగా, దానికి కైపర్ బెల్ట్ అని పేరు పెట్టారు. వీటిలో కొన్ని రాతితో, కొన్ని లోహాలతో, మరికొన్ని గడ్డకట్టిన వాయువులతో ఉంటాయి. యురేనస్ గ్రహాన్నీ, అలాగే కైపర్ బెల్టులో ఉన్న సెడ్నా లాంటి పదార్థాలను ఒక భారీ గ్రహమేదో ప్రభావితం చేస్తున్నదని గ్రహించారు.ఓ 11 ఖగోళ పదార్థాలు ఒకే దిశలో, ఒకే వేగంతో కదులుతుండటం ఈ సిద్ధాంతానికి బలాన్నిచ్చింది. కాలిఫోర్నియాకు చెందిన మైక్ బ్రౌన్, కాన్‌స్టాంటిన్ బెటిజిన్ ఈ గ్రహపు పరిణామాన్ని కూడా అంచనా వేసే ప్రయత్నం చేశారు. మన భూమి కంటే ఈ గ్రహం 5-6 రెట్లు బరువుగా ఉంటుందని, 2-4 రెట్లు అధిక పరిమాణంతో ఉండవచ్చనీ తేల్చారు. అది మొదలు ఎంతోమంది శాస్త్రవేత్తలు ఈ గ్రహం గురించి మరిన్ని వివరాలను ఊహిస్తున్నారు. వీటి విషయంలో వేర్వేరు శాస్త్రవేత్తల లెక్కలు వేర్వేరుగా ఉన్నాయి కానీ ఊహ కోసం ఓసారి వాటిలో ముఖ్యమైనవాటిని చూద్దాం.ఈ గ్రహం, సూర్యుడి చుట్టూ తిరిగేందుకు పది నుంచి 20 వేల సంవత్సరాలు పడుతుందని ఓ అంచనా.

భూమి నుంచి సూర్యుడికి మధ్య ఉన్న దూరాన్ని ఆస్ట్రనామికల్ యూనిట్‌గా (AU) పేర్కొంటారు. ఖగోళ దూరాలను ఈ AU లెక్కతో పోలుస్తారు. మన భూమి నుంచి ఈ తొమ్మిదో గ్రహం 400-800 AU ల దూరంలో ఉందని అంటున్నారు. భూమి లాగానే ఈ తొమ్మిదో గ్రహం కూడా సూర్యుడి చుట్టూ దీర్ఘవృత్తాకారంలో తిరుగుతున్నది.


రాతి చుట్టూ గడ్డకట్టుకున్న మంచుతో ఈ గ్రహం కప్పబడి ఉందని ఊహిస్తున్నారు.

అతుకుల వెతుకులాట: సాంకేతికత ఇంతలా అభివృద్ధి చెందిన సమయంలో ఓ పెద్ద గ్రహం మన కళ్లు కప్పి తిరగడం ఆశ్చర్యంగా ఉండవచ్చు. కానీ ఈ అనంత విశ్వంలో మన ఉనికి పిపీలికమే అని చెప్పేందుకు, ఈ గ్రహాన్ని కనిపెట్టలేకపోవడమే ఓ పెద్ద ఉదాహరణ. నెప్ట్యూన్‌కు సూర్యుడికి మధ్య ఎంత దూరం ఉందో నెప్ట్యూన్ నుంచి అంతకు 13-26 రెట్ల దూరంలో ఈ తొమ్మిదో గ్రహం ఉంది. అల్లంత దూరంలో ఉన్న గ్రహం నుంచి ప్రతిఫలించే కాంతి చాలా చాలా తక్కువగా ఉంటుంది. ప్లూటో కంటే 600 రెట్లు కాంతిహీనంగా ఈ గ్రహం ఉంటుందని అనుమానం. పైగా ఇది సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకారంలో తిరుగుతుంది కాబట్టి, బాగా దూరంగా వెళ్లినప్పుడు దాన్ని కనిపెట్టడం కష్టం! అయినా పట్టు విడవకుండా వేర్వేరు మార్గాలలో ప్లానెట్ 9 ఉనికిని కనిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.సూపర్ కంప్యూటర్, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల ద్వారా ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న ఖగోళ చిత్రాలన్నిటినీ పరిశీలిస్తూ ప్లానెట్ 9 కక్ష్య అని ఊహించే ప్రాంతంలో ఏదైనా వస్తువు కనిపిస్తుందేమో చూస్తున్నారు.హవాయి ద్వీపంలో మౌనాకి అనే నిద్రాణ అగ్నిపర్వతం మీద సుబారు టెలిస్కోప్ ఉంది. ప్రపంచంలో అతి పెద్ద దూరదర్శినులలో ఇదీ ఒకటి. ఇక్కడినుంచి తరచూ ప్లానెట్ 9 ఉనికిని గుర్తించే ప్రయత్నం జరుగుతున్నది.చిలీలో వేరా రూబిన్ నక్షత్రశాల భూమి నుంచి కనిపించే ఆకాశం మొత్తాన్నీ దశలవారీగా చిత్రీకరించింది. ఆ డేటాను ఉపయోగించుకుని ప్లానెట్ 9 ఆనవాళ్లను గమనిస్తున్నారు.ఈ గ్రహం ప్రయాణిస్తున్నది అని ఊహిస్తున్న కక్ష్యలోని గ్రహశకలాలు, తోకచుక్కల్ని నిశితంగా గమనిస్తే వాటి మీద కచ్చితంగా ప్లానెట్ 9 ప్రభావం కనిపిస్తుంది. శాస్త్రవేత్తలు అదే చేస్తున్నారు.తక్కువ కాంతి ఉన్న ఖగోళ వస్తువులను కనుగొనేందుకు రేడియేషన్‌తో పనిచేసే టెలిస్కోపులను ఉపయోగిస్తారు. వెలుతురు లేకున్నా చల్లదనమో, వేడో ఉంటుంది కదా! ఇన్‌ఫ్రారెడ్ కిరణాల ద్వారా ఈ ఉష్ణోగ్రతలను పసిగట్టి, అక్కడ ఓ గ్రహమో, గ్రహశకలమో ఉన్నట్టు నిర్ధారించవచ్చు. ఈ సాంకేతికతతో పనిచేసే అధునాతన టెలిస్కోపులతో ప్లానెట్ నైన్ ఉనికిని గమనించే ప్రయత్నం జరుగుతున్నది

### గ్రహరాజు సూర్యుడు

వేద వాఙ్మయంలో గ్రహగతుల గురించి విస్తారమైన విశ్లేషణలు కనిపిస్తాయి. ఖగోళ శాస్త్రం నక్షత్రంగా తేల్చిన సూర్యుణ్ని జ్యోతిశ్శాస్త్రం గ్రహంగా పేర్కొన్నది. సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, గురువు, శుక్రుడు, శని ఏడు గ్రహాలతోపాటు రాహువు, కేతువును ఛాయా గ్రహాలుగా చెబుతున్నది. ఈ గ్రహాలన్నిటికీ రవిని రాజుగా నిర్ణయించింది. ఆయా గ్రహాలకు భావాలను నిర్దేశించింది. ద్వాదశ రాశుల్లో గ్రహ గమనాన్ని బట్టి.. ఫలితాలు నిర్దేశించింది. రవి కాంతి ఛత్రంలోకి వెళ్లిన గ్రహాలు తమ శక్తిని కోల్పోతాయని.. గ్రహరాజు ప్రభావం అలాంటిదని పలు జ్యోతిష గ్రంథాలు పేర్కొన్నాయి.

ముందే కనుగొన్న భారతీయుడు?



నెప్ట్యూన్ ఆవలి గ్రహం గురించి ఇంతలా చర్చ జరుగుతున్న సమయంలో వందేండ్ల క్రితం ఓ భారతీయ ఖగోళ శాస్త్రవేత్త ప్రతిపాదించిన సిద్ధాంతం తెర మీదకు వచ్చింది. 1911లోనే వెంకటేశ్ కేటకర్ అనే శాస్త్రవేత్త, నెప్ట్యూన్‌కి ఆవల మరో రెండు గ్రహాలు ఉన్నాయని చెప్పడమే కాకుండా వాటికి బ్రహ్మ, విష్ణు అని పేర్లు కూడా పెట్టాడు. ఫ్రెంచ్ ఖగోళ పత్రికలో ఈ సిద్ధాంతాన్ని ప్రచురించారు కూడా! ఈ వ్యాసం వెలుగులోకి వచ్చిన రెండు దశాబ్దాల తర్వాత ప్లూటో గ్రహాన్ని కనుగొన్నారు. ఆశ్చర్యం ఏమిటంటే – సూర్యుడి నుంచి ప్లూటో వరకు ఉన్న దూరం, సూర్యుడి చుట్టూ అది తిరిగే సమయం వెంకటేశ్ సూచించిన లెక్కలకు చాలా దగ్గరగా ఉండటం. మరి రెండో గ్రహం గురించి వెంకటేశ్ అంచనా నిజమో కాదో తెలియాలంటే, దాని ఉనికి గురించి పూర్తి సమాచారం రావాల్సిందే. దురదృష్టం ఏమిటంటే ఈ శాస్త్రవేత్త గురించి ఇటు ప్రజలకు కానీ, అటు వైజ్ఞానిక లోకానికి కానీ తెలియకపోవడం.

### పాపం ప్లూటో

నెప్ట్యూన్ గతిలో మార్పులకు కారణం ప్లూటోనే అని నిర్ధారించుకుంటే, మరో గ్రహం గురించిన ఆలోచన వచ్చేదే కాదు. కానీ ప్లూటోకి అంత శక్తి లేదని గ్రహించారు శాస్త్రవేత్తలు. ఓ గ్రహానికి ఉండాల్సిన-గుండ్రంగా ఉండటం, సూర్యుని చుట్టూ తిరగడం అనే లక్షణాలు ప్లూటోకి ఉన్నప్పటికీ దాని దారిలో ఎలాంటి అడ్డంకులూ లేకుండా చేసుకునేంత శక్తి లేదు. ఓ గ్రహానికి ఉండాల్సిన ముఖ్యమైన లక్షణం ఇదే. ఒకవేళ ప్లూటోను కనుక గ్రహంగా గుర్తిస్తే కైపర్ బెల్టులోని సెడ్నా, ఎరిల్ లాంటి ఇతర మరుగుజ్జు గ్రహాలను కూడా గుర్తించాల్సి ఉంటుంది!

### రోచ్ లిమిట్

రెండు ఖగోళ వస్తువుల మధ్య కనీస దూరానికి సంబంధించిన పరిమితిని రోచ్ లిమిట్ సూచిస్తుంది. ఒక చిన్న ఖగోళ వస్తువు మరో పెద్ద వస్తువు గురుత్వాకర్షణకు లోను కావద్దొంటే పెద్ద వస్తువు వ్యాసార్ధంతో పోలిస్తే చిన్న వస్తువు కనీసం రెండున్నర రెట్లు ఎక్కువ దూరంలో ఉండాలి. లేకుంటే చిన్న వస్తువు పెద్దదాని ఆకర్షణకు లోనవుతుంది. ఉదాహరణకు శని గ్రహం చుట్టూ ఉండే వలయాలు. శని గ్రహానికి చెందిన ఓ ఉపగ్రహం మధ్య దూరం శని గ్రహం వ్యాసంతో పోలిస్తే రెండున్నర రెట్ల కంటే తక్కువగా ఉండటంతో అది కాస్తా విచ్ఛిన్నమైపోయింది. ఆ భాగాలే శని గ్రహం చుట్టూ వలయాలుగా తిరుగుతున్నాయేమో అని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ సిద్ధాంతాన్ని పందొమ్మిదో శతాబ్దానికి చెందిన ఫ్రెంచి ఖగోళ శాస్త్రజ్ఞుడు ఎడ్వర్డ్ రోచ్ ప్రతిపాదించాడు. అయితే ఇది భూమి చుట్టూ తిరిగే చాలా చిన్న పరిమాణంలో ఉండే కృత్రిమ ఉపగ్రహాలకు వర్తించదు.

### ఉన్నట్టా లేనట్టా!

ఖగోళాన్ని దుర్భిణి వేసి గాలిస్తున్నా ప్లానెట్ 9 కనిపించడం లేదు. నెప్ట్యూన్ దాటి వెళ్లిన వాయేజర్ 2, న్యూ హొరైజాన్స్ అనే వ్యోమనౌకలకు అక్కడ ఓ భారీ గ్రహం ఉన్న ఆనవాళ్లు కనిపించలేదు. అలాగని దాని ఉనికిని కొట్టిపారేద్దామంటే కైపర్ బెల్టులో ఉన్న వస్తువుల వింత ప్రవర్తనకు కారణం ఏమిటి? ఈ ప్రశ్నకు ప్లానెట్ 9 కాకుండా ఇతర కారణాలను అన్వేషించే పనిలో పడ్డారు శాస్త్రవేత్తలు. కైపర్ బెల్టులో లెక్కలేనన్ని మరుగుజ్జు గ్రహాలు, శకలాలు ఉన్నాయి. వాటిలో కొన్నిటి కక్ష్య ఒకేలా సాగడం యాదృచ్ఛికం కావచ్చు.

వలయాకారంలో ఎన్నో వస్తువులు ప్రయాణిస్తున్నప్పుడు, వాటిలోని కొన్ని భాగాలు ఆ వలయంతోపాటు సాగుతాయి. అదేమీ అసాధారణం కాదు.

కైపర్ బెల్టులో నెలకొన్న పరిస్థితులకు కారణం ప్లానెట్ 9 మాత్రమే కాకపోవచ్చు అంటారు కొందరు శాస్త్రవేత్తలు. ఇది ఫలానా చోట ఉంది, ఇంత వైశాల్యంతో ఉంది అని వేసే అంచనాలు నిజం కాకపోవచ్చు అన్నది వారి వాదన. దానికి కారణం మరో గ్రహం కావచ్చు. అది మరింత దగ్గరగానో, చాలా దూరంలోనో ఉండవచ్చు.కోజొయ్ మెకానిజం అనే సిద్ధాంతం చెప్పేదేంటంటే కొన్ని ఖగోళ వస్తువులు పరస్పర ఆకర్షణతో కలిసి తిరిగే అవకాశం ఉంది. దీనికి ప్లానెట్ 9 ప్రభావమే కారణం కానవసరం లేదు.

ఈ కైపర్ బెల్టులోని వస్తువులను ఆకర్షిస్తున్న ప్లానెట్ 9 అసలు ఓ గ్రహమే కాకపోతే ఇంకేమిటి? అనే ప్రశ్న కూడా వస్తోంది. కృష్ణబిలాలు కూడా తమ చుట్టూ ఉన్న వాతావరణం మీద ఇలాంటి ప్రభావమే చూపిస్తాయి. కృష్ణబిలాలు కాంతిని సైతం మింగేస్తాయి కాబట్టి, వాటిని కనిపెట్టడం అంత తేలిక కాదు. ఎంత ప్రయత్నిస్తున్నా ప్లానెట్ 9 కనిపించకపోవడానికి కారణం ఇదేనేమో అని ఓ అనుమానం!

### ప్లానెట్ 10 కూడా ఉంటుందా!

ప్లానెట్ 9 కైపర్ బెల్టులో భాగంగానో, దానికి సమీపంగానో ఉండవచ్చు. కానీ అక్కడితో సౌర కుటుంబం అంతమవదు. ఈ వలయానికి ఆవల మరో గ్రహం ఉందని కొందరు శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. కైపర్ బెల్ట్ ఒక్కసారిగా అంతమైపోయి, తర్వాత అంతా నిర్మానుష్యంగా ఉండటానికి కారణం ఆ గ్రహమే అంటున్నారు. సౌర కుటుంబం చుట్టూ కైపర్ బెల్ట్ ఉంటే, మరింత దూరంలో ఊర్ట్ క్లౌడ్ అనే మరో వలయం ఉంటుంది. గడ్డకట్టిన వాయువులు, గ్రహశకలాలతో నిండి ఉండే ప్రదేశమిది. కొన్ని తోకచుక్కలు ఆవిర్భవించేది ఇక్కడే. ఇందులో టైకీ అనే ఓ భారీ గ్రహం ఉందని కొందరు శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు.

Backyard Worlds పేరుతో నాసా ఖగోళ శాస్త్రం పట్ల ఆసక్తి ఉన్నవారితో రకరకాల ప్రాజెక్టులు చేపడుతున్నది. నెప్ట్యూన్ ఆవల గ్రహాల ఉనికిని కనుక్కోవడమే దీని ఉద్దేశం. ఇందులో భాగంగా రకరకాల గ్రహాల ఉనికి బయటపడుతున్నది కానీ వాటిలో చెప్పుకోదగ్గవి ఏవీ తోచడం లేదు.

మొత్తానికి ప్లానెట్ 9 ఉందనే అనుమానం చాలా బలంగానే ఉంది. అందుకు అనుకూలంగా, ప్రతికూలంగా ఎన్నో సాక్ష్యాలూ ఉన్నాయి. మనిషి అల్పసంతోషి. ఓ కొత్త గ్రహం ఉందని తెలిసినప్పుడు దానివల్ల ఎలాంటి ఉపయోగం లేకున్నా ఓ తెలియని సంతోషానికి గురవుతాడు. అందుకే అందరూ ప్లానెట్ 9 ఉనికి పట్ల ఆశగా ఉన్నారు. ఒకవేళ మనం చెప్పుకొన్న చోట, ఊహించిన పరిమాణంలో ప్లానెట్ 9 లేకున్నా సౌర కుటుంబపు అంచుల లోపల ఏదో ఒక కొత్త గ్రహం దొరికేందుకు మాత్రం చాలా అవకాశాలే ఉన్నాయి. విశ్వానికి ఉన్న ప్రత్యేకతే అది. అందులో రాశికి కొదవ లేదు. రహస్యాలకు అంతం ఉండదు. అంతేకాదు బ్రహ్మాండాన్ని గమనించినప్పుడు, పరిశోధిస్తున్నప్పుడు మనం ఎంత సామాన్యులమో కూడా తెలిసొస్తుంది!

## శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో యాగశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మల్కాజ్గిరి జూన్ 29 (సాక్ష్యం న్యూస్) గౌతమ్ నగర్ డివిజన్ లోని గోపాల్ నగర్ లోగల శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో యాగశాల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై చండీయాగం హెూమం, ప్రత్యేక పూజ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్లో 5 ఎం. ఎల్. డి. వాటర్ రిజర్వాయర్, గౌతమ్ నగర్ ఆర్ యు బి నిర్మాణం కొరకు , జె ఎల్ ఎస్ ఎన్ నగర్ లో దేవాదాయ శాఖ భూముల విషయంలో పర్మినెంట్ స్టే ఆర్డర్ తీసుకురావడం లాంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వరసిద్ధి వినాయక దేవాలయానికి తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర్, మధుసూదన్, సాంబమూర్తి, భాస్కర్, శ్రీనివాసులు, సాంబమూర్తి, సత్యనారాయణ, విష్ణుమూర్తి, ఉషాదేవి, సరోజ బిఆర్ఎస్ పార్టీ నాయకులు జేఏసీ వెంకన్న, బైరు అనిల్, సిద్ధి రాములు, కృష్ణ గౌడ్, హేమంత్ పటేల్, శశిధర్, వాసు, లావణ్య శ్రీలత, సుధా, కార్యకర్తలు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి



మల్కాజ్గిరి జూన్ 29 (సాక్ష్యం న్యూస్) మల్కాజ్గిరి నియోజకవర్గం పరిధిలో బాలాజీ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డిసిసి అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి, జిల్లాకు నియమించబడ్డ అబ్జర్వేర్లు బడంగ్ పేట మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ దుర్గం భాస్కర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు వైనాల ప్రవీణ్ కుమార్, మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ మహిళా నాయకులు, గౌతమ్ నగర్ 141 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు పడాలని బీరప్ప దేవుని పండగ



నారాయణఖేడ్ జూన్ 29( సాక్ష్యం న్యూస్ ) నారాయణఖేడ్ మండలంలోని రుద్రారం గ్రామంలో వర్షాలు పడాలని కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామీ పండగ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆరెస్ మాజీ మండల అధ్యక్షులు, తాజామాజీ సర్పంచ్ ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ నారాయణఖేడ్ మండల అధ్యక్షులు, కురుమ యువత నియోజకవర్గం ఉపాధ్యక్షులు సిందోల్ దశరథ్ మాట్లాడుతూ వర్షాలు కురువలని, పంటలు బాగా పండాలని,అందరు సుబిక్షంగా ఉండాలని రుద్రారం బీరప్ప స్వామికి పూజలు నిర్వహించి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. గత 25 రోజులుగా వర్షాలు కురవక విత్తనాలు మొలకెత్తడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని రైతులు స్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులు గట్టు మారుతి, భూంగొండ,మల్గొండ, అడవిగొండ,రాంగొండ, శరణుగొండ,విష్ణు మల్లేష్, సురేష్, అంబుగొండ పండరి,కార్తీక్,రాజు, ఈశ్వర్, అంజుగొండ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ బోర్డ్ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటు



ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ (29): ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీలోని హనుమాన్ మందిరం ఆలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పూర్వ కార్యవర్గ సభ్యులు జమ, కర్చులను సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం ఎన్నికల అధికారులు పోటీదారుల పేర్లు ఇవ్వాలని కోరగా, మేక మోహన్ దాస్, పుష్పా కర్రావు,రామోజీ దశరథు ముగ్గురు సభ్యులు అధ్యక్ష పదవికి పోటీ చేయగా తర్జనభజన అనంతరం కాలనీ గౌరవ అధ్యక్షులు, ఎన్నికల కమిటీ నూతనకార్యవర్గాన్నిఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామోజీ దశరథ్, ప్రధాన కార్యదర్శిగా కొరికెలి ఆత్మ చరణ్, క్యాషియర్ గా డి కొండ కిషన్ ల తో పాటు ఉపాధ్యక్షులుగా అలిశెట్టి రత్నాకర్, కరుణాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా భూమా గౌడల్ల సురేందర్ గౌడ్, ను గౌరవ అధ్యక్షులుగా మోత్కూరి లింగ గౌడ్, మోహన్ దాస్, ఎలగందుల లింబాద్రిగౌడ్, పుష్పకర్ రావు, లను ముఖ్య సలహాదారులుగా,వి సత్య గౌడ్, పూజ నరేందర్, ఎన్ మాణిక్యం, రవి నాథ్, నాయిని భాస్కర్, వేముల ప్రకాష్లతోపాటు కార్యవర్గ సభ్యులుగా బోర్వెల్ శ్రీనివాస్, అమృతాల శ్రావణ్, రాస ఆనంద్, పవన్ జోషి, పొలాస విక్కీ, రిషికేష్, ప్రశాంత్ శర్మ,,గణేష్, స్నేహిల్, గుడి శ్రీను, గుడి కిసాన్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, కాలనీవాసుల సహకారంతో ఆలయ ప్రాంగణ అభివృద్ధికి తమ శక్తి మేరకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## భారమవుతున్న ప్రైవేట్ చదువు

– ఏటేటా పెరుగుతున్న ఫీజులు – అన్ని తమ వద్దే కొనాలని యాజమాన్యాల నిబంధనలు

– ఫీజులతో సరి సమానంగా పుస్తకాలు, యూనిఫారాల ధరలు – కుదేలేడు అవుతున్న తల్లిదండ్రులు

ఆర్మూర్ సాక్ష్యం న్యూస్(29): సమాజంలో నేడు చదువు ను కొనుక్కోవడం చాలా భారంగా మారింది. ఏటేటా పెరుగుతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజులు మోయలేక తల్లిదండ్రులు కుదేలులవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమానులు నూతన పోకడాల పేరిట కొత్త కొత్త పద్ధతులను ప్రవేశ పెడుతూ తదనుగుణంగా పుస్తకా లు, యూనిఫారాలు, బూట్లు టైలు, బెల్టు అన్ని తమ వద్దే కొనాలని ఆంక్షలు విధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. మెరుగైన చదువు దేవుడుఎరుగుకానీయాజమాన్యాల ఆంక్షలకు, విద్యార్థుల తల్లిదండ్రులు రుణాల బారిన పడుతున్నారు. ఇద్దరూ పిల్లలు ఉన్న కుటుంబం నేడు వారి పిల్లలకుచదువునుఅందించాలంటే తలకు మించిన భారంగా మారింది. ప్రతి పాఠశాల ఒక దుకాణాన్ని తెరిచి తమ పాఠశాలలో అడ్మిషన్ అవడంతోనే యూనిఫారంలను, పాఠ్యపుస్తకాలను, టై,బెల్టు బూట్లతో సహా అధిక ధరలకు విక్రయిస్తూ నిర్బంధంగా తమ వద్ద కొనాలని ఆంక్షలు విధించడం బాధాకరమైన విషయం. ఒకపక్క ప్రభుత్వం ఉచిత విద్యకు ఎన్ని ప్రణాళికలు తయారు చేసిన, వివిధ పాఠశాలలను స్థాపించిన ప్రైవేటు పై తగ్గని మోజు విద్యార్థుల తల్లిదండ్రులపై ఎనలేని భారాన్ని మోపుతుంది. ప్రభుత్వం కట్టుదిట్టంగా ఆంక్షలు విధిస్తే తప్ప సమాజంలో ప్రైవేటు విద్యావ్యవస్థపై మూజు తగ్గేలా లేదు. కోట్లు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం స్థాపించినప్పటికీ వాటిపై సరియైన ప్రణాళికను కానీ, నిర్వహణ లేకపోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు నిర్వీరో మారుతున్నాయి. సమాజంలో చైతన్యం వచ్చినప్పటికీని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలల పైనే మోజు పెరుగుతుంది.

**సంక్షేమలకు పథకాలకు కళ్లెం వేయాలి**

ప్రైవేటు పాఠశాలలో చదివే వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందకుండా చట్టాలను రూపొందిస్తే తప్ప విద్యార్థుల తల్లిదండ్రులలో మార్పు వచ్చేలా కనిపించడం లేదు. ప్రభుత్వం దృఢమైన జీవోలను తీసుకువచ్చి ప్రైవేట్ వ్యవస్థపై ఆంక్షలు విధించాలి. ప్రైవేట్ పాఠశాలలో చదివే వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందకుండా చేస్తేనే ప్రజల్లో మార్పు వస్తుంది.

## బీసీ కుల జన గణన చేపట్టాలి: బిసి హక్కుల సాధన సమితి




వరంగల్ జూన్ 29 (సాక్ష్యం న్యూస్ ) : బీసీ ఉద్యమాలకు తలొగ్గిన మోడీ ప్రభుత్వం కాలయాపనకు పోకుండా తక్షణమే జనగణనతో పాటు బీసీ కుల జనగణన చేపట్టాలని కుమారస్వామి డిమాండ్ చేశారు. తమ్మెర భవన్ లో వలబోజు వెంకన్న అధ్యక్షతన జరిగిన వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజుతో కలిసి కుమారస్వామి మాట్లాడుతూ ఈ దేశంలో 1931లో బ్రిటిష్ వారు చేసిన కుల జనగణ తప్ప స్వాతంత్ర్య అనంతరం ఏ ప్రభుత్వం కూడా బీసీల కుల జనగణన చేపట్టలేదన్నారు. ఈ దేశంలో ఉత్పత్తి కులాలైన బీసీలు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో వెనక్కి నెట్టివేయబడ్డారన్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా బీసీలు అన్ని రంగాల వారు ఉద్యమాలు చేస్తున్నా అగ్రకుల పార్టీలు పట్టించుకోకపోగా, అగ్రకులాలు పేదల పేరుతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఆగమేఘాల మీద తీసుకువచ్చి అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈడబ్లూఎస్ రిజర్వేషన్లకు బీసీలు వ్యతిరేకం కాదన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల తరహాలోనే బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు ఇవ్వటానికి తక్షణమే జనాభా లెక్కలతో 2025సంవత్సరం లోనే దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టాలన్నారు. తమ ప్రభుత్వం కుల జనగణనకు వ్యతిరేకమంటూ ప్రకటించిన మోడీ ప్రభుత్వం, బీసీల ఉద్యమాలను చూసి కులజనగణన చేస్తామని చెప్పుతూనే 2028 వరకు కుల గణన చేస్తాననీ చెప్పడం బీసీలను మోసం చేసేందుకే అని అన్నారు. రాబోయే జనరల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందే ఎత్తుగడ తప్ప మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదనేది తేలిపోయిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన స్థానిక సంస్థలలో 42శాతం రిజర్వేషన్ల కోసం చేసిన చట్టాన్ని తక్షణమే కేంద్రం ఆమోదించకుండా తమ అగ్రకుల పక్షపాతాన్ని ప్రదర్శిస్తున్నదన్నారు. కులజనగణన సర్వే 2025, లోనే చేపట్టాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేయాలనీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు జూలై 14 వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరపతలపెట్టిన ధర్నాలో బీసీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీలకు ఇవ్వవలసిన పెండింగ్ నిధులను, వెంటనే మంజూరు చేయాలన్నారు. కామరెడ్డి బీసీ డిక్లరేషన్ సమగ్రంగా అమలు చేయాలన్నారు. ఈసమావేశంలో ఖిలా వరంగల్ అధ్యక్ష కార్యదర్శులు మౌంట్ కుమారస్వామి,నల్లతీగల కుమార్ ,వరంగల్ మండల నాయకులు చంద్రశేఖర్ , నర్సంపేట పట్టణ కన్వీనర్ మహాదేవుని జగదీష్ , నల్లబెల్లి మండల కన్వీనర్ చీకటి ప్రకాష్ , నర్సంపేట మండలాధ్యక్షులు కమ్మాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ. రెండు లక్షలు విలువ చేసే గుట్కా అంబర్ ప్యాకెట్లు పట్టివేత



నర్సంపేట , జూన్ 29 (సాక్ష్యం న్యూస్ ) : ఓమ్నివ్యాన్ లో నిషేధిత గుట్కా , అంబర్ ప్యాకెట్లను తరలిస్తుండగా నిందితుడిని పట్టుకున్నట్లు నర్సంపేట ఎస్ ఐలు రఘుపతి రెడ్డి , రవి కుమార్ లు తెలిపారు. ఎస్ ఐలు తెలిపిన వివరాల ప్రకారం ... ప్రాథమిక సమాచారం మేరకు నర్సంపేట ఎస్ ఐలు రఘుపతి రెడ్డి, రవి కుమార్ లు సిబ్బంది అదివారం మహబూబాద్ రోడ్డు సర్వాపురం బంక్ వద్ద కాపుకాసి వాహనాలు తనీఖీ చేపట్టారు. ఆసమయంలో మహబూబాద్ నుండి నర్సంపేటకు వస్తున్న ఓమ్ని వాన్ లో చెక్ చేయగా దాదాపు రూ రెండు లక్షల విలువ చేసే ప్రభుత్వ నిషేధిత గుట్కా అంబర్ ప్యాకెట్లు పట్టుబడ్డాయన్నారు. నర్సంపేట శివారు కమలాపురంకు చెందిన ముత్తినేని వీరన్న అక్రమంగా నిషేదిత గుట్కా ,అంబర్ ప్యాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. నిందితుడితో పాటు వాహనంను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని వివరించారు.

## భూ తగాదా నేపథ్యంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ.. ఒకరు మృతి



నారాయణఖేడ్ జూన్ 29( సాక్ష్యం న్యూస్ ) సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో భూ వివాదం ఘాతుక రూపం దాల్చింది. స్థానికుల సమాచారం మేరకు, అన్న హనుమంతుడు తన తమ్ముడు రమేష్తో భూ తగాదా అంశంపై వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో రమేష్ తన మిత్రుడు జైపాల్తో కలిసి పొలంలో ఉన్న సమయంలో, హనుమంతుడు గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. దాడిలో జైపాల్ (35) అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్ తీవ్రంగా గాయపడగా, అతన్ని 108 అంబులెన్స్ ద్వారా నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## మెడికల్ డీ కోడింగ్ వర్క్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ జూన్ 29 ( సాక్ష్యం న్యూస్) : హన్మకొండ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన మెడికల్ డీ–కోడింగ్ వర్క్ షాప్ ను పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మన వరంగల్ నగరంలో ఇలా ఒక గొప్ప మెగా వర్క్‌షాప్ జరుగుతుండటం గర్వంగా ఉందన్నారు. మెడికల్ ఢీ–కోడింగ్ అనేది ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చాలా పెద్ద కెరీర్ మార్గం అవుతోందన్నారు. మీరు ఇండియా నుంచే యూఎస్, యూకే లాంటి దేశాలకు కోడ్ చేసే అవకాశం పొందుతున్నారని ఇదే డిజిటల్ ఇండియా శక్తి అని అన్నారు. థాట్ ఫ్లోస్ వంటి అకాడమీ ఇప్పటి వరకు 30,000 మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును నిర్మించిందని, ఇది గర్వించదగిన విషయమన్నారు. ఈ రోజు మీరు తీసుకున్న ఈ ఒక అడుగు, రేపటి గొప్ప కెరీర్‌కు మొదటి మెట్టు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వాహకులైన థాట్ ఫ్లోస్ టీమ్‌ని అభినందించి ఇలాంటి కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు,ఈ సదవకాశాన్ని సద్వినియొగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్, బంక సరళ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి, బంక సతీష్,యూత్ నాయకులు కేతిడి దీపక్ రెడ్డి, రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తల కైనా

– పేద ప్రజల స్థానికుల ఆరోపణ



సాక్ష్యం న్యూస్, శివంపేట. శివ్వంపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పథకంలో అసమానతలు చోటు చేసుకున్నట్లు పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమున్నా ఇళ్లు లభించక కొందరు నిరాశకు లోనవుతుండగా, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకే ప్రాధాన్యం ఇచ్చి ఇళ్లు మంజూరు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రుస్తుపేట నవీన్ విలేకరులతో మాట్లాడుతూ నిజంగా ఇళ్లు అవసరమున్న మా లాంటి పేదవారిని పక్కన పెట్టి, అధికార పార్టీలో ఉన్న వారికి ఇళ్లు ఇచ్చారు. ఇది ఎంతవరకు న్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఈదుల పూసంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి

## శంకుస్థాపన పట్టణ అభివృద్ధి పథంలో మైలురాయి


– ఎమ్మెల్యే డా మురళీ నాయక్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 29 (సాక్ష్యం న్యూస్) మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డ్ ఈదుల పూసంపల్లి గ్రామంలో సాధారణ నిధుల నుంచి మంజూరైన ₹5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించబోయే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డా. భూక్యా మురళీ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు పట్టణ నాయకులు, గ్రామ నాయకులు, స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా మురళీ నాయక్ మాట్లాడుతూ. ఈదుల పూసంపల్లి గ్రామానికి సీసీ రహదారి మంజూరవడం అభివృద్ధికి నాంది. వర్షాకాలంలో మట్టి రోడ్ల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడానికి ఈ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుంది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. మహబూబాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు నేను కృషి చేస్తాను, అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఈ శంకుస్థాపనపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ గ్రామానికి అభివృద్ధి వంతు రోడ్డు రూపంలో అందించిన ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ అభివృద్ధిలో మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## మహా న్యూస్ హెడ్ ఆఫీస్ పై దాడి చేసిన
# బిఆర్ఎస్ నాయకుల పై చర్యలు తీసుకోవాలి

– బోడా రమేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ మరిపెడ పట్టణ నాయకులు



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 29 (సాక్ష్యం న్యూస్)** మహా న్యూస్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ పై బిఆర్ఎస్ నాయకులు రాళ్లతో కర్రలతో దాడి చేసి విధ్వంసం సృష్టించటం అనేక కార్లు ధ్వంసం చేయటం ఆఫీసు సిబ్బందిపై శనివారం దాడి చేయడం జరిగింది . ఆఫీస్ లో విలువైన వస్తువులను ధ్వంసం చేయటం ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టుగానే ప్రజలు భావిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థలం లాంటిది ఇది పత్రిక స్వచ్ఛనే హరించడమే. ఫోన్ టాపింగ్ విషయంలో సీట్ దర్యాప్తు చేస్తున్న విషయాలన్నీ మహా న్యూస్ ఛానల్ లో వారు ప్రసారం చేసినందుకు దాడి చేయటం అమానుషం. ఇది బిఆర్ఎస్ పార్టీ వారి ఆ ప్రజాస్వామిక పిరికిపంద చర్య ఇట్టి దాడి చేసిన వారిపై వెంటనే విచారణ చేసి తగు చర్యలు బిఆర్ఎస్ నాయకుల పై తీసుకోవాలని తెలిపారు.

# అసత్య ఆరోపణలు మానుకో..

– మా అక్క పేరా భూమి ఉంటే చూపించు – మా నాయకులు అవినీతి చేస్తే నిరూపించు
– క్రిటికల్ కేర్ యూనిట్కు ఎమ్మెల్యే మరో రెండు ఎకరాలు ఇప్పించాలి
– నా రాజకీయ జీవితం లో అవినీతి చేయలేదు – జడ్చర్లలో మాజీ మంత్రి డాసి లక్ష్మా రెడ్డి ప్రెస్మీట్





**జడ్చర్ల : జూన్ 29 (సాక్ష్యం న్యూస్)** జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సూచించారు. తమ మీద బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని, బాధ్యత గల వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేయొద్దన్నారు. జడ్చర్ల రాజకీయాల్లో కుటుంబ సభ్యులను లాగడం ఎప్పుడు లేదన్నారు. జడ్చర్ల లోని ప్రేమ్ రంగా గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న జడ్చర్ల లో జరిగిన లైన్స్ క్లబ్ సమావేశంలో ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మా అక్క మీద రెండు ఎకరాల భూమి ఎక్కడుందో నిరూపిస్తే ఇచ్చేస్తామన్నారు. వంద పడకల హాస్పిటల్ నిర్మాణం కోసం రెండు ఎకరాలు కొని నిర్మాణం చేస్తే మా మీద ఆరోపణలు చేయడమేంటన్నారు. ఎమ్మెల్యే గారు పక్కనే ఉన్న మరో రెండు ఎకరాలు కూడా హాస్పిటల్ కి ఇప్పించాలన్నారు. జడ్చర్ల నియోజకవర్గం లో చాలా చోట్ల అసైన్మెంట్ ల్యాండ్ తీసుకొని వారికి డబ్బులు ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సొంత గ్రామం లో కూడా ఇదే విధంగా చేశామని తెలిపారు. హాస్పిటల్ రోడ్డు నిర్మాణం కోసం అయ్యే ఖర్చు భరిస్తానని తెలిపారు. పాత బజారు కి భారీ వాహనాలు వెళ్లాడానికి ఎటువంటి ఇబ్బంది లేదని..అంబేద్కర్ చౌరస్తా వద్ద డివైడర్ ఓపెన్ ఉంటుందని తెలిపారు. స్లో అయ్యి రైట్ తీసుకొని వెళ్లొచ్చన్నారు. ఎర్రగుట్ట లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్దిదారులకు దక్కాలన్నారు. అర్హులైన వారికి కేటాయించి మిగతా వారిని ఖాళీ చేయిస్తే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల తరువాత ఇండ్లను కొంతమంది ఆక్రమించుకుంటే మాకేం సంబంధం అన్నారు. అయినా అధికారులు విచారణ చేపట్టి నిజమైన లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలన్నారు. ఉద్దండపూర్ పరిహారం విషయం లో ఎలాంటి అవకతవకలు జరగలేదని...కెసిఆర్ ని ఒప్పించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ముప్పై శాతం పెంచామని గుర్తు చేశారు. మీరు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు. జడ్చర్ల నియోజకవర్గం లో రాసరిక పాలన కొనసాగుతుందని ఓవైపు ఎమ్మెల్యే సోదరుడు మరోవైపు ఆమె తల్లి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎస్కార్ట్ వాహనాల్లో తిరగడం ఎంతవరకు సమంజసంమన్నారు. టిఆర్ఎస్ నాయకులపై అవినీతి జరిగి ఉంటే నిరూపించాలని పార్టీ పరంగా తాను చర్యలు తీసుకున్నందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రెస్ మీట్ లో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడగల్ యాదయ్య బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పిట్టల మురళి రఘుపతి రెడ్డి ప్రనిల్ చందర్ కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్ రెడ్డి నందకిషోర్ గౌడ్ సతీష్ దేవా జ్యోతి చైతన్య బిఆర్ఎస్ నాయకులు రామ్మోహన్ నరసింహ యాదవ్ శ్రీకాంత్ ఇంతియాజ్ నాగిరెడ్డి మహమూద్ ప్రకాష్ శ్రీనివాస్ యాదవ్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు

# పాలమూరు పాత్రికేయుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన తప్పదు

– మామిడి సోమయ్య




**మహబూబ్ నగర్ జూన్ 29(సాక్ష్యం):** మహబూబ్ నగర్ లో జర్నలిస్టుల ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్య పై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల బృందం పట్టణంలోని టీటీడి కళ్యాణమండపం ఎదురుగా నిర్వహిస్తున్న జర్నలిస్టుల రిలే దీక్షా శిభిరాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుత, జిల్లాలో గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్ళను లబ్ధిదారులకు స్వాధీనపర్చక పోవడం సరైందికాదని అన్నారు. పట్టాలిచ్చిన ఇండ్లను జర్నలిస్టులకు స్వాధీనపర్చకుండా ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం, స్థానిక జిల్లా అధికార యంత్రాంగం వివక్ష చూపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించి జర్నలిస్టుల దీక్షలను విరమింప జేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం 30వ తేదీన మహబూబ్ నగర్ పట్టణంలోని ఆర్ %ఽ% బి ఈ ఈ కార్యాలయం ఎదుట జర్నలిస్టుల రిలే దీక్షా శిబిరం వద్ద ఉదయం 11గంటలకు జర్నలిస్ట్ దాసరి నరసింహ సంస్మరణ సభ కార్యక్రమాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మహబూబ్ అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అధ్యక్షుడు వాకిటి అశోక్ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, కావున జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ప్రజాసంఘాల ప్రతినిధులు రాజకీయ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు, ఈ సందర్భంగా పాలమూరు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చావేదిక ఉంటుందని పేర్కొన్నారు.దీక్ష శిభిరాన్ని సందర్శించిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడితాడు బాపురావు వున్నారు. వీరితో పాటుగా జిల్లా అధ్యక్షకార్యదర్శులు వాకిట అశోక్ కుమార్, మొలకల పల్లి గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, ఐఫ్ డబ్ల్యూ జె ఎఫ్ జాతీయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర రావు,ఎ్రక్టానిక్ బాధ్యులు పసుపుల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం డి రఫీ,అనిల్, రవి కుమార్ లు తదితరులున్నారు.

# విశ్వ వ్యాప్తంగా ఇందూరు పసుపు..

– అన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.. పసుపు రేటు తగ్గదు
– పాకిస్తాన్కు తగిన పాఠం చెప్పాము.. – ఢిల్లీకి పెద్దలకు తెలంగాణ ఏటీఏం
– బిఆర్ఎస్ ది అవినీతి పాలన – కిసాన్ సమ్మాన్ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా








**నిజామాబాద్, (సాక్ష్యం న్యూస్) జూన్ 29 :** ఇక మీదట ఇందూరు పసుపు విశ్వవ్యాప్తం అవుతుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభించిన అనంతరం పాలిటెక్నిక్ గ్రౌండ్లో జరిగిన కిసాన్ సమ్మాన్ బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారన్నారు. మోదీ మాట ఇచ్చారంటే తప్పకుండా నెరవేరుస్తామని చెప్పారు. బోర్డు ఏర్పాటుతో ఇక ఎప్పటికీ పసుపు రేటు పడిపోదని అమిత్ షా పసుపు రైతులకు భరోసా ఇచ్చారు. అలాగే పసుపు ఎగుమతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. పసుపు బోర్డు ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగు పరుస్తామన్నారు. పసుపు మార్కెటింగ్, ఎగుమతు కోసం కొత్త వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూడు నాలుగు సంవత్సరాల్లోనే నిజామాబాద్ పసుపు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుందని చెప్పారు. ఆర్గానిక్ పసుపు ఉత్పత్తితో పాటు మార్కెటింగ్కు కేంద్రం కృషి చేస్తోందన్నారు. భారత్ ఆర్గానిక్ కో ఆపరేటివ్ లిమిటెడ్ శాఖలు నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తామన్నారు. వీటి ద్వారా పసుపు ఎగుమతులు పెంచుతామని అమిత్ షా పేర్కొన్నారు.

**పాకిస్తాన్ కు దీటైన జవాబు**

ఉరి, పుల్వామా, పహల్గామ్ దాడులకు దీటైన బదులు ఇచ్చామని అమిత్ షా తెలిపారు. పదేళ్లలో మూడు సార్లు పాకిస్తాన్ పై భారత్ దాడి చేసిందని చెప్పారు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ చేశామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ గడ్డపైకి వెళ్లివారిపై దాడి చేశామన్నారు. పాకిస్తాన్లోని ఉగ్రవాదుల హెడ్ క్వార్టర్లను భారత సైన్యం ధ్వంసం చేసిందన్నారు. అంతేకాకుండా కీలక టెర్రరిస్టులను మట్టుబెట్టిందని పేర్కొన్నారు. కానీ రాహుల్ గాంధీ బాబా ఆధారాలు అడుగుతున్నారన్నారు. పాకిస్తాన్ మాట రాహుల్ గాంధీ నోట వస్తోందన్నారు. మరోపక్క ేశంలో 2026 వరకు నక్సలిజాన్ని అంతం చేస్తామని అమిత్ షా స్పష్టం చేశారు. దశాబ్దాలుగా నక్సలిజం గిరిజన ప్రాంతల్లో అడ్డుకుంటోందన్నారు. మావోయిస్టులను అంతం చేయాలా వద్దా మీరే చెప్పండి అని ప్రేక్షకులను అడిగారు. మావోయిస్టులు వెంటనే హత్యాకాండ విడిచి తక్షణం లొంగిపోవాలని, ప్రజలలో కలిసి పని చేయాలని సూచించారు.

**అవినీతి బీఆర్ఎస్..**

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో ఎంతో అవినీతి జరిగిందని అమిత్ షా అన్నారు. ధరణి, కాళేశ్వరం, సింగరేణి నియామకాలు, టీఎస్పీఎస్సీ పేరిట కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి వద్దనుకొని ప్రజలు కాంగ్రెస్కు అధికారం అప్పగించారన్నారు. కానీ రేవంత్రెడ్డి ప్రభుత్వం బీఆర్ ఎస్ అవినీతిపై ఒక్క కేసు కూడా నమోదు చేయడం లేదన్నారు. ప్రస్తుతం రేవంత్ సర్కారు కూడా అవినీతి మయంగా మారిందని విమర్శించారు. గతంలో తెలంగాణ బీఆర్ఎస్ కు ఏటీఎంగా ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ ఢిల్లీకి ఏటీఎంగా మారిందన్నారు. రాష్ట్రంలో అధికారం మారినా అవినీతి మారలేదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని అన్నారు. ఈ కార్యమంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, ఎంపీలు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు దంపాల్ సూర్య నారాయణ, రాకేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం.. పసుపు బోర్డును ఏర్పాటు చేశాం

– కార్యాలయ ప్రారంభోత్సవ సమావేశంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా – అంతర్జాతీయ స్థాయిలో పసుపు పంట ఎగుమతులు జరిగేలా కృషి చేస్తామని వెల్లడి
– పాల్గొన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ – హాజరైన రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క










**నిజామాబాద్, (సాక్ష్యం న్యూస్) జూన్ 29 :** తెలంగాణ ప్రాంత పసుపు రైతులకు చేసిన వాగ్దానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసిందని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అధిక విస్తీర్ణంలో పసుపు పండించే నిజామాబాద్ జిల్లాలో బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, ఇదే జిల్లాకు చెందిన రైతు బిడ్డ పల్లె గంగారెడ్డిని బోర్డు చైర్మన్ గా నియమించామని గుర్తు చేశారు. నిజామాబాద్ లో నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆదివారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పసుపు బోర్డు వైస్ చైర్మన్ భవాని, ఇతర ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ సంరంభంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా బస్వా గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, పసుపు బోర్డు కార్యాలయానికి ప్రారంభోత్సవం చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వెలిబుచ్చారు. ఆహార పదార్థాలలోనే కాకుండా, శుభ కార్యాలలో, ఔషధ తయారీలలో విరివిగా వినియోగించే పసుపు పంటను నిజామాబాద్ జిల్లా రైతాంగం అధికంగా సాగు చేస్తోందని, అందుకే ఈ ప్రాంత రైతుల ఆకాంక్షను గౌరవిస్తూ ప్రధాని మోదీ నిజామాబాద్ లో పసుపు బోర్డును నెలకొల్పారని అన్నారు. నిజానికి 2023 లోనే బోర్డు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, ఈ ఏడాది ఆరంభంలో కేంద్రం పసుపు బోర్డు ప్రకటన చేసిందని, ఇప్పుడు బోర్డు కార్యాలయాన్ని కూడా ప్రారంభించిందని అమిత్ షా వెల్లడించారు. పసుపు సాగు ద్వారా యావత్ దేశంలోని ప్రజలందరికీ ఆరోగ్యాన్ని పంచుతూ, దేశ సమృద్ధికి పాటుపడుతున్న పసుపు రైతులకు అండగా నిలవాలని సంకల్పంతోనే కేంద్రం బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. దేశంలోనే అత్యధికంగా నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లాలలో పసుపు పంట సాగు చేస్తున్నారని అమిత్ షా గుర్తు చేశారు. అనేక దశాబ్దాలుగా ఈ పంట పండిస్తున్నప్పటికీ పసుపు రైతులకు జాతీయ అంతర్జాతీయ మార్కెట్ కు అనుగుణంగా లాభాలు సమకూరడం లేదని అన్నారు. ప్రస్తుతం బోర్డు ఏర్పాటు వల్ల పసుపు రైతులకు ఇప్పుడు అందుతున్న మద్దతు ధర కంటే రానున్న రెండు మూడు సంవత్సరాల కాలంలోనే క్వింటాలుకు అదనంగా కనీసం రూ. 7000 వరకు ఎక్కువ ధర లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పసుపు బోర్డు ద్వారా రైతులకు నాణ్యమైన పంటను సాగు చేసేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు మార్కెటింగ్, ఎగుమతులు, బ్రాండింగ్ వంటి వాటిని మెరుగుపరచడం జరుగుతుందని, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. 2030 వరకు అంతర్జాతీయ స్థాయిలో ఒక మిలియన్ డాలర్ల విలువ చేసే పసుపు ఉత్పత్తులను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అమిత్ షా వెల్లడించారు. అంతర్జాతీయ ఎగుమతుల వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారత్ కో–ఆపరేటివ్ ఎక్స్ పోర్ట్ లిమిటెడ్, ఆర్గానిక్ పంటను ప్రోత్సహించేందుకు భారత్ ఆర్గానిక్ కో–ఆపరేటివ్ ఎక్స్ పోర్ట్ లిమిటెడ్ సంస్థలను నెలకొల్పిందని గుర్తు చేశారు. ఈ ప్రాంత పసుపు రైతులకు మరింత మేలు చేకూరేలా ఎక్స్ పోర్ట్ లిమిటెడ్ సంస్థల శాఖలను నిజామాబాద్ లో కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

**పసుపు రైతుల కల నెరవేర్చిన కేంద్రానికి ధన్యవాదాలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

తెలంగాణ ప్రాంత పసుపు రైతుల చిరకాల వాంఛను గుర్తించి పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేసే నిజామాబాద్ జిల్లాలో బోర్డును నెలకొల్పడం వల్ల ఈ ప్రాంత రైతుల పోరాటం ఫలించినట్లయ్యిందని అన్నారు. జాతీయ పసుపు బోర్డుతో నిజామాబాద్ జిల్లా ప్రతిష్ట మరింతగా ఇనుమడిస్తుందని, పసుపు రైతులకు ఇతోధికంగా మేలు జరుగుతుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ బోర్డు ఏర్పాటు పసుపు పంట ఎగుమతులు, ఆధునాతన సాగు విధానాలు, యాంత్రీకరణ, సరికొత్త పరిశోధనలు, మెరుగైన మార్కెటింగ్ వంటి వసతులతో పసుపు రైతులకు ప్రయోజనం కలిగేలా కేంద్రం పూర్తిస్థాయిలో బోర్డు ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ రైతాంగానికి కావాల్సిన సహాయ సహకారాలను కేంద్రం అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తోందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాల కోసం ఏడాది కాలంలోనే తమ ప్రభుత్వం రూ. లక్ష కోట్ల వరకు వెచ్చించిందని వెల్లడించారు. అంతకుముందు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. పసుపు బోర్డును ఏర్పాటు చేస్తూ, నిజామాబాద్ లో నెలకొల్పిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీకి పసుపు రైతుల పక్షాన ధన్యవాదాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.





# సరదాగా కుస్తీ పోటీలో పాల్గొన్న ఆటగాళ్లు

భారత క్రికెట్ జట్టులో పేసర్లుగా స్థిరపడుతున్న అర్ష్‌దీప్ సింగ్, ఆకాష్ దీప్ ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్ కోసం టీమిండియాతో కలిసి ఉన్నారు. తొలి టెస్టులో ఓటమి తర్వాత, రెండో టెస్టుకు జస్ప్రీత్ బుమ్రా విశ్రాంతి తీసుకోవడంతో, అతని స్థానంలో అర్ష్‌దీప్ లేదా ఆకాష్ దీప్‌లలో ఒకరు తుది జట్టులోకి వస్తారని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, మ్యాచ్ ప్రాక్టీస్, తీవ్రమైన శిక్షణతో పాటు, ఆటగాళ్లు తమ ఒత్తిడిని తగ్గించుకోవడానికి సరదా పలకరింపులు, చిలిపి పనులు చేస్తుంటారు. అలాంటిదే ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో అర్ష్‌దీప్ సింగ్, ఆకాష్ దీప్ ఇద్దరూ భారత బౌలింగ్ కోచ్, దక్షిణాఫ్రికా దిగ్గజ పేసర్ మోర్నే మోర్కెల్‌తో కలిసి సరదాగా "రెజ్లింగ్" (కుస్తీ) చేస్తూ కనిపించారు. ఈ వీడియోలో, అర్ష్‌దీప్ సింగ్, ఆకాష్ దీప్ ఇద్దరూ మోర్నే మోర్కెల్‌ను సరదాగా పట్టుకుని, కింద పడేయడానికి ప్రయత్నిస్తున్నారు. మోర్కెల్ కూడా వారిని అంతే సరదాగా ప్రతిఘటిస్తూ, వారితో సరదాగా కుస్తీ పడుతున్నాడు. ఈ వీడియో టీమిండియా శిబిరంలో ఎంత సరదా వాతావరణం ఉందో స్పష్టం చేస్తోంది. ఆటగాళ్లు తమ ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఇలాంటి చిలిపి చేష్టలు చేస్తుంటారని, ఇది వారి మధ్య మంచి స్నేహబంధాన్ని కూడా పెంపొందిస్తుందని ఈ వీడియో చూస్తే అర్థమవుతుంది. సాధారణంగా, అంతర్జాతీయ క్రికెట్‌లో ఆటగాళ్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లు, సుదీర్ఘ సిరీస్‌ల సమయంలో ఈ ఒత్తిడి మరింత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో, కోచింగ్ స్టాఫ్, సీనియర్ ఆటగాళ్లు జూనియర్లతో కలిసి సరదాగా గడపడం, వారిని ప్రోత్సహించడం చాలా ముఖ్యం. మోర్నే మోర్కెల్, అర్ష్‌దీప్, ఆకాష్ దీప్‌లతో కలిసి ఇలా సరదాగా పాల్గొనడం, జట్టులో మంచి వాతావరణం నెలకొని ఉందని సూచిస్తుంది. ఇది ఆటగాళ్ల ప్రదర్శనపై కూడా సానుకూల ప్రభావం చూపుతుంది. మోర్నే మోర్కెల్ భారత బౌలింగ్ కోచ్‌గా నియమితులైనప్పటి నుంచి, బౌలింగ్ విభాగానికి తన అనుభవాన్ని పంచుకుంటూ, ఆటగాళ్లకు మెరుగైన శిక్షణను అందిస్తున్నాడు. ఆటగాళ్లతో అతను ఎంత సరదాగా ఉంటాడో, వారితో ఎంత సన్నిహితంగా మసులుకుంటాడో ఈ వీడియోకు ఒక నిదర్శనం. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో టీమిండియా బాగా రాణించాలని కోరుకుంటున్న సమయంలో, ఈ సరదా వీడియో అభిమానులకు కూడా కాస్త ఊరటనిచ్చింది. అర్ష్‌దీప్, ఆకాష్ దీప్‌లలో ఎవరు రెండో టెస్టులో ఆడుతారనే ఉత్కంఠ ఒకవైపు ఉండగా, వారి సరదా వీడియో మాత్రం అందరినీ అలరిస్తోంది.

## అర్ష్‌దీప్ సింగ్ ను జట్టులోకి తీసుకొనే అవకాశం

ఇప్పుడు టీం ఇండియా దృష్టి జులై 2న ప్రారంభమయ్యే ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌పై ఉంది. ఈ మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా ఆడకపోయే అవకాశం ఇప్పటికే టీం ఇండియా టెన్షన్‌ను పెంచింది. దానికి తోడు, మిగిలిన బౌలర్ల అసమర్థ ప్రదర్శన ఈ ఆందోళనను మరింత పెంచుతోంది. ఇటువంటి పరిస్థితిలో, కోచ్ గంభీర్ ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో అర్ష్‌దీప్ సింగ్‌ను బరిలోకి దింపడం ద్వారా ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌కు కొత్త సవాలును అందించగలడు.జూన్ 27 శుక్రవారం నుంచి ఈ టెస్ట్ మ్యాచ్ కోసం టీం ఇండియా తన ప్రాక్టీస్ ప్రారంభించినందున దీనికి సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సమయంలో గంభీర్ అర్ష్‌దీప్‌తో చాలా సేపు చర్చించాడు. రెవ్‌స్పోర్ట్జ్ నివేదిక ప్రకారం, ఇద్దరి మధ్య జరిగిన ఈ చర్చ సాధారణ సూచనల మార్పిడిలా కనిపించలేదు. కానీ, ఉత్సాహంతో నిండి ఉంది. తన ఆశలన్నీ అర్ష్‌దీప్‌పైనే ఉన్నాయని గంభీర్ అతన్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపించింది. బుమ్రా లేకపోవడంతో టీం ఇండియాలో ఒక మార్పు ఖాయం. కానీ, ఇది ఒక్కటే మార్పు అవుతుందా? కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గంభీర్ మిగిలిన ఆటగాళ్లకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకుంటే, బుమ్రా స్థానంలో ఎవరికి అవకాశం ఇస్తారు? ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ రూపంలో ఎంపికలు ఉన్నాయి. ఆకాష్ దీప్ మరింత అనుభవజ్ఞుడు. ప్రభావవంతమైనవాడు అయినప్పటికీ, అర్ష్‌దీప్ ఇంకా టెస్ట్ అరంగేట్రం చేయలేదు. కానీ, అర్ష్‌దీప్ ఎడమచేతి వాటం పేసర్. అలాంటి పరిస్థితిలో, అతను భారత బౌలింగ్ లైనప్‌కు వైవిధ్యాన్ని తీసుకురావడం ద్వారా ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టగలడు.




## క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మృతి

ఈ రోజుల్లో గుండెపోటు కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. శనివారం నటి షెఫాలీ జరీవాలా 42 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. షెఫాలీ మరణంతో సినీ పరిశ్రమను విషాదం అలుముకుంది. తాజాగా క్రికెట్ ఆడుతూ ఓ క్రికెటర్ గుండెపోటుతో మరణించాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో మ్యాచ్ ఆడుతుండగానే ఒక ఆటగాడికి గుండెపోటు వచ్చింది.

బ్యాటింగ్ చేస్తుండగానే గుండెపోటు రావడంతో మైదానంలోనే ప్రాణాలు కోల్పోయాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా గురుహర్ సహాయ్ డీఏవీ స్కూల్ మైదానంలో క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ఆ సమయంలో బ్యాటర్ ఒక భారీ సిక్స్ కొట్టాడు. సిక్స్ కొట్టిన తర్వాత బ్యాటర్ పిచ్‌పై కూర్చుండిపోతాడు. ఆ తర్వాత నాన్-స్ట్రైక్ ఎండ్‌లో ఉన్న అతని సహచర ఆటగాడు పరిగెత్తుకుంటూ అతని వద్దకు వస్తాడు. చూస్తుండగానే బ్యాటర్ పిచ్‌పైనే పడిపోయాడు. దీంతో అక్కడున్న ఆటగాళ్లందరూ ఆ బ్యాటర్ వద్ద పరిగెత్తుకుంటూ వచ్చారు. కొంతమంది అతని చేతులకు మసాజ్ చేస్తే.. మరికొందరు కాళ్లకు మసాజ్ చేశారు. కానీ ఆ బ్యాటర్ గుండెపోటు కారణంగా పిచ్‌పైనే ప్రాణాలు కోల్పోయాడు. గుండెపోటుతో మరణించిన ఆటగాడి పేరు హర్‌జీత్ సింగ్ అని తెలుస్తోంది. అతను 49 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నాడు. మైదానంలో సహచర ఆటగాళ్లు అతడికి సీపీఆర్ చేసి స్పృహలోకి తీసుకురావడానికి చాలా ప్రయత్నించారు కానీ సాధ్యం కాలేదు.




# చెన్నైలో హాకీ వరల్డ్ కప్..

### భారత్-పాక్ మ్యాచ్‌కు రంగం సిద్ధం

అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) ఆధ్వర్యంలో పురుషుల జూనియర్ ప్రపంచ కప్ భారత్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ తమిళనాడులో నిర్వహించబడుతుంది. ఈ సారి ఈ టోర్నమెంట్‌లో 24 జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో పాకిస్థాన్ జట్టు కూడా ఉంది. ఇప్పుడు పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో పాకిస్థాన్ జట్టు భారత్‌కు రావచ్చు. ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల జట్లు క్రీడా మైదానంలో ముఖాముఖి తలపడటం ఇదే మొదటిసారి. అంతే కాకుండా ఈ టోర్నమెంట్ కోసం భారత్-పాకిస్థాన్‌లను ఒకే పూల్‌లో ఉంచారు. హాకీ పురుషుల జూనియర్ ప్రపంచకప్ కోసం మొత్తం 24 జట్లను 6 పూల్స్‌లో ఉంచారు. దీంతో మరోసారి అభిమానులు క్రీడా మైదానంలో భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య పోరును చూడవచ్చు.అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) హాకీ పురుషుల జూనియర్ ప్రపంచ కప్ 2025 భారత్‌లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు జరుగుతుంది.గత సారి హాకీ పురుషుల జూనియర్ ప్రపంచ కప్ టైటిల్‌ను జర్మనీ గెలుచుకుంది. ఫైనల్‌లో జర్మనీ ఫ్రాన్స్‌ను 2-1 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ఈ రోజు హాకీ ప్రపంచానికి ఒక చారిత్రాత్మక క్షణం, ఎందుకంటే మేము 24 దేశాలు పాల్గొనే మొదటి అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) జూనియర్ పురుషుల హాకీ ప్రపంచ కప్ కోసం పూల్ డ్రాను చూస్తున్నాము. హాకీ ఇండియా తరపున దేశవ్యాప్తంగా హాకీ క్రీడాకారులకు వారి దృఢమైన మద్దతుకు ప్రధాని నరేంద్ర మోడీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను." అని అన్నారు.

## షెఫాలీ జరీవాలా, పృథ్వీషా కలిసి డ్యాన్స్

షెఫాలీ జరీవాలా, భారత క్రికెటర్ పృథ్వీషాకి సంబంధించిన ఒక వీడియో వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో వారిద్దరూ కలిసి డ్యాన్స్ చేస్తున్నారు. షెఫాలీ జరీవాలా 42 ఏళ్ల వయస్సులో కన్నుమూశారు. ఆమె మృతికి కారణం గుండెపోటు అని తెలుస్తోంది. క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా షెఫాలీ మరణంపై సంతాపం వ్యక్తం చేశారు. కాగా షెఫాలీ జరీవాలా ఈ నెలలోనే మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌ను కూడా సందర్శించారు. జూన్ 6వ స్టేడియం నుంచి కొన్ని ఫోటోలను పంచుకున్నారు. భారత క్రికెటర్ పృథ్వీ షా, షెఫాలీ జరీవాలాకు సంబంధించిన ఒక వీడియో వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో, వారిద్దరూ తమ స్నేహితులతో కలిసి డ్యాన్స్ చేస్తూ కనిపిస్తారు. ఈ సమయంలో షెఫాలీ భర్త పరాగ్ త్యాగి కూడా అక్కడే ఉండి డ్యాన్స్ చేస్తున్నారు. ఈ వీడియో జూన్ 9, 2024న సోషల్



మీడియాలో షేర్ చేయబడింది. ఆ రోజు పృథ్వీ షా తన 25వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఇది ఆ రోజు జరిగిన పుట్టినరోజు పార్టీ వీడియో అయి ఉండవచ్చు. షెఫాలీ జరీవాలా పృథ్వీ మాజీ ప్రియురాలు నిధి తపాడియాతో స్నేహం కారణంగా పృథ్వీని కలుసుకున్నట్లు అనిపిస్తోంది. ఎందుకంటే వీడియోలో నిధి కూడా కనిపిస్తుంది. అయితే వారు డ్యాన్స్ చేస్తున్న తీరు చూస్తుంటే వారిద్దరి మధ్య మంచి స్నేహం ఉన్నట్లు తెలుస్తోంది. షెఫాలీ జరీవాలా ఈ నెల ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌కు కూడా వెళ్లారు. ఆమె ఫోటోలు దిగి జూన్ 6న ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే, ఆమె కేవలం పర్యటనకు వెళ్లిందా లేదా ఏదైనా పనిమీద వెళ్లిందా అనే వివరాలు తెలియవు.మాజీ భారత క్రికెటర్ శిఖర్ ధావన్ కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ షెఫాలీ జరీవాలా మరణంపై సంతాపం వ్యక్తం చేశారు. శిఖర్ ధావన్ ఇలా రాసుకొచ్చాడు. "చాలా త్వరగా వెళ్లిపోయారు, షెఫాలీ జరీవాలా. మీ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ కష్టకాలంలో ఆమె కుటుంబానికి భగవంతుడు శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను." అని పేర్కొన్నారు.

## అంపైర్ నిర్ణయాలపై అసహనం..

### డారెన్ సామీకి ఐసీసీ షాక్!

బార్బడోస్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వెస్టిండీస్‌ను 159 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 180 పరుగులకే ఆలౌట్ కాగా.. వెస్టిండీస్ కూడా 190 పరుగులే చేయగలిగింది. 10 పరుగుల ఆధిక్యం సాధించినా.. ఆస్ట్రేలియా 310 పరుగులు చేసి 301 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. వెస్టిండీస్ 141 పరుగులకే ఆలౌట్ అయింది. మ్యాచ్‌లో అంపైర్ అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ఎక్కువ భాగం ఆతిథ్య జట్టుకు వ్యతిరేకంగా వెళ్లాయి. ఈ క్రమంలో ఆగ్రహించిన కోచ్ డారెన్ సామీ అంపైర్ పేరు ప్రస్తావించి నిర్ణయాలపై ప్రశ్నలు లేవనెత్తారు.వెస్టిండీస్ వర్సెస్ ఆస్ట్రేలియా మొదటి టెస్టులో థర్డ్ అంపైర్ అడ్రియన్ హెూల్డ్‌స్టాక్ 5 వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో నాలుగు వెస్టిండీస్‌కు వ్యతిరేకంగా వెళ్లాయి. కోచ్ డారెన్ సామీ విలేకరుల సమావేశంలో థర్డ్ అంపైర్ నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని తర్వాత ఐసీసీ డారెన్ సామీకి శిక్ష విధించింది.

తప్పుడు నిర్ణయాల వల్ల మ్యాచ్ తమకు వ్యతిరేకంగా వెళ్లిందని విలేకరుల సమావేశంలో అంపైర్ పేరును ప్రస్తావిస్తూ డారెన్ సామీ పేర్కొన్నారు. ఈ జట్టుకు వ్యతిరేకంగా ఎందుకు నిర్ణయాలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఒకదాని తర్వాత ఒకటిగా ఇలాంటి తప్పుడు నిర్ణయాలు చూసినప్పుడు ప్రశ్నలు తలెత్తుతాయని అన్నారు. డారెన్ సామీతో పాటు కెప్టెన్ రాస్టన్ ఛేజ్ కూడా ప్రశ్నలు లేవనెత్తారు.ఐసీసీ డారెన్ సామీకి డీమెరిట్ పాయింట్ విధించడంతో పాటు ఆయన మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానాగా విధించింది. వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్‌కు కూడా మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించారు. పాట్ కమిన్స్‌ను ఔట్ చేసిన తర్వాత కొన్ని సైగలు చేసినందుకు ఆయనకు ఈ శిక్ష విధించారు. వెస్టిండీస్ కెప్టెన్ రాస్టన్ ఛేజ్ కూడా అంపైర్ నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆటగాళ్లు తప్పు చేస్తే శిక్ష పడుతుంది కానీ అంపైర్‌కు ఏమీ కాదని అన్నారు. నిజానికి ఒక నిర్ణయం ఛేజ్‌కు వ్యతిరేకంగా కూడా వచ్చింది. టెస్టు రెండో రోజు పాట్ కమిన్స్ అతడిని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేశారు. కానీ ఛేజ్ దీనిపై డీఆర్ఎస్ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్ కు దగ్గరగా ఉన్నప్పుడు కొంత స్పైక్ ఉన్నట్లు చూపించినప్పటికీ థర్డ్ అంపైర్ అతడిని ఔట్‌గానే ఇచ్చారు. ఈ టెస్టులో థర్డ్ అంపైర్ ఒకటి కాదు అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. మొదటి రోజున ట్రావిస్ హెడ్ బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి వికెట్ కీపర్ షాయ్ హెూప్ వద్దకు వెళ్ళింది. ఈ క్యాచ్‌ను పరిశీలించినప్పుడు థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ఇచ్చారు. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో అలెక్స్ కారీ షాయ్ హెూప్ క్యాచ్‌ను ఒక చేత్తో పట్టుకున్నాడు. ఈ క్యాచ్‌ను పరిశీలించమని అంపైర్ థర్డ్ అంపైర్‌ను కోరగా, అతను అవుట్‌గా ప్రకటించాడు. అయితే రీప్లేలో క్యాచ్ తీసుకునేటప్పుడు బంతిలో కొంత భాగం గ్రౌండ్‌ను తాకినట్లు కనిపించింది.




## అభిమాని కోసం టికెట్ కొనుగోలు చేసిన నీరజ్ చోప్రా

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రస్తుతం ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్‌కు సిద్ధమవుతున్నాడు. జులై 5న బెంగళూరు వేదికగా ఈ ఈవెంట్ జరగనుంది. ఈ నేపథ్యంలో నీరజ్ తన మంచి మనసు చాటుకున్నాడు. ఓ అభిమాని కోరికను నెరవేర్చాడు. అతడికి ఈ ఈవెంట్ లైవ్ చూసే అవకాశాన్ని కల్పించాడు.తమిళనాడు కొయంబత్తూర్‌కు చెందిన రంజిత్ కుమార్ అనే వ్యక్తికి నీరజ్ అంటే చాలా అభిమానం. అయితే భారత్ వేదికగా తొలిసారి జరగనున్న ఎన్‌సీ క్లాసిక్ టోర్నీని అతడు ఎలాగైనా లైవ్‌లో చూడాలని ఆశపడ్డాడు. దీంతో 'ఎవరైనా రూ.2000 స్పాన్సర్ చేసినట్టైతే, బెంగళూరు వెళ్లి ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్ చూస్తాను' అని రంజిత్ సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశాడు. అయితే దీనికి ఏకంగా ఒలింపింక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రానే స్పందించాడు. 'అతడి కోసం సొంత ఖర్చులతో ఈ ఈవెంట్ చూసేందుకు ఏర్పాట్లు చేశాడు. 'హాయ్ రంజిత్, మీకు వీవీఐపీ అనుభవంతో ఎన్‌సీ క్లాసిక్ టోర్నీ చూసే అవకాశం కలగనుంది. ఈ బెంగళూరు ట్రిప్ ఖర్చు నాదే. అంతేకాదు నాకు 90 మీటర్ల దూరంలోనే మీ బస ఉంటుంది. త్వరలోనే కలుద్దాం' అని నీరజ్ అన్నాడు. దీంతో నీరజ్ మనసు బంగారం అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. కాగా, ఈ ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్ గత మే నెలలో 24 తేదీనే జరగాల్సి ఉంది. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ఈ టోర్నీ వాయిదా పడింది. ఇక జూలై 4న ఈ టోర్నీని నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో నీరజ్‌తో పాటు థామస్ రోలర్ (జర్మనీ), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) లాంటి స్టార్లు పోటీ పడుతున్నారు.రీసెంట్‌గా నీరజ్ చోప్రా పారిస్ డైమండ్ లీగ్ విజేతగా నిలిచాడు. ఈ ఈవెంట్‌లో నీరజ్ 88.16 మీటర్లు దూరం జావెలిన్ విసిరి అద్భుత విజయం సాధించాడు. జర్మనీకి చెందిన వెబర్ జులియన్ (87.88 మీటర్లు), బ్రెజిల్‌కు చెందిన ద సిల్వ లూయిజ్ మౌరికో (86.62) తర్వాత స్థానాల్లో నిలిచారు.

## నా వల్లే ఇండియా ఓటమి: ప్రసిధ్ కృష్ణ

ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓటమికి తానే ప్రధాన కారణమని స్టార్ పేసర్ ప్రసిధ్ కృష్ణ అన్నాడు. అంచనాలకు తగ్గట్లు తాను బౌలింగ్ చేయలేకపోయానని తన తప్పిదాన్ని అంగీకరించాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో ఓడిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ప్రసిధ్ కృష్ణ దారుణంగా విఫలమయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 220 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు తీసాడు.ఓవైపు బుమ్రా కట్టుదిట్టంగా బౌలింగ్



చేసినా.. మరోవైపు ప్రసిధ్ కృష్ణ ధారళంగా పరుగులిచ్చాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 371 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. తాజాగా తన ప్రదర్శనపై మాట్లాడిన ప్రసిధ్ కృష్ణ.. లోపాలను సరిదిద్దుకొని మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు.'తొలి ఇన్నింగ్స్‌లో నేను ఆశించిన రీతిలో బౌలింగ్ చేయలేదు. రెండో ఇన్నింగ్స్ వచ్చేసరికి పిచ్ నెమ్మదించడంతో నా బౌలింగ్ కాస్త మెరుగైంది. కచ్చితంగా నేను అనుకున్న విధంగా సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయలేకపోయాను. పిచ్‌ను అర్థం చేసుకోవడం విఫలమయ్యాను. ప్రొఫెషనల్ ఆటగాడిగా నా లోపాలను అధిగమించే ప్రయత్నం చేస్తాను. ఈ విషయంలో పూర్తి బాధ్యత తీసుకుంటాను.

భవిష్యత్తు మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తాను. ప్రతీ ఓవర్‌నూ మెయిడిన్ చేయాలనుకుంటా. బౌండరీలు ఇవ్వాలనుకోను. తొలి టెస్ట్‌లో ఔట్ ఫీల్డ్ వేగంగా ఉంది. నిజం చెప్పాలంటే.. నేను బౌలింగ్ చేసిన లైన్ అండ్ లెంగ్త్ చాలా సార్లు పర్ఫెక్ట్‌గా లేదు. దాంతో ఇంగ్లండ్ బ్యాటర్లు పరుగులు రాబట్టారు. కొన్నిసార్లు బంతి బ్యాట్ ఎడ్జ్‌లకు తాకి బౌండరీలకు వెళ్లాయి. తొలి టెస్ట్‌లో నేను దారుణంగా విఫలమయ్యాను.'అని ప్రసిధ్ కృష్ణ చెప్పుకొచ్చాడు.

# సినిమాల్లోకి రావాలనుకునే వారికోసం 'దిల్ రాజు డ్రీమ్స్' లాంటి అద్భుతమైన ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేసిన దిల్ రాజుకి అభినందనలు

దిల్ రాజు డ్రీమ్స్ లాంచ్ ఈవెంట్‌లో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ

–'దిల్ రాజు డ్రీమ్స్'లో యాక్టర్స్, డైరెక్టర్స్, టెక్నీషియన్స్‌తో పాటు ప్రొడ్యూసర్స్‌కి కూడా ఒక కాలమ్ కేటాయించడం గొప్ప విషయం. ఇలాంటి ప్లాట్‌ఫామ్ నేను ఇదివరకు ఎక్కడా చూడలేదు: రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్

–ఇండస్ట్రీలోకి రావాలనుకునే కొత్తవారికి సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో 'దిల్ రాజు డ్రీమ్స్' వెబ్‌సైట్‌ని లాంచ్ చేస్తున్నాం: నిర్మాత దిల్ రాజు

కొత్త దర్శకులు, కొత్త నిర్మాతలు, ఆర్టిస్టులు టెక్నీషియన్స్ కి ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటప్పుడు ఏం చేస్తే బాగుంటుందని వచ్చిన ఆలోచనే ఈ దిల్ రాజు డ్రీమ్స్. ఇండస్ట్రీలోకి రావాలనుకునే వారికి సరైన వేదిక అవుతుందనే ఆలోచనతో దిల్ రాజు డ్రీమ్స్ వెబ్ సైట్ ని లాంచ్ చేస్తున్నాం' అన్నారు నిర్మాత దిల్ రాజు. దిల్ రాజు డ్రీమ్స్ వెబ్ సైట్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ వేడుకకు ముఖ్య అతిధులుగా హాజరై వెబ్ సైట్ ని లాంచ్ చేశారు.

దిల్ రాజు డ్రీమ్స్ లాంచింగ్ ఈవెంట్ లో రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. 13 ఏళ్ల క్రితం పొద్దున లేచిన వెంటనే idlebrain డాట్ కామ్ అనే వెబ్సైట్ ని ఓపెన్ చేసే వాడిని. ఎక్కడైనా కాస్టింగ్ కాల్స్ ఉన్నాయా అని చెక్ చేసుకునే వాడిని. ఆ రోజుల్లో ఇంత ఇంటర్నెట్, సోషల్ మీడియా లేదు. శేఖర్ కమ్ముల గారి లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమా కాస్టింగ్ కాల్ అందులో చూడడం నాకు ఇంకా గుర్తుంది. దానికి అప్లై చేశాను. దాదాపు 6 నెలలు టెన్షన్ పడ్డాను. ఆ టెన్షన్ కూడా ఒక తృప్తిని ఇచ్చేది. ఒక ప్రయత్నం చేస్తున్నాం. ఒక ఆపర్చునిటీ ఉందనే ఆనందం ఉండేది. 16 వేల అప్లికేషన్స్ ఆ సినిమాకి వచ్చాయి. 11 మందిని సెలెక్ట్ చేశారు. అందులో నేను ఉన్నాను. ఆ సినిమా నా జీవితంలో పెద్ద రోల్ ని ప్లే చేసింది. ఒక అవకాశం ఎంత గొప్పదో నాకు తెలుసు. దిల్ రాజు డ్రీమ్స్ ని దిల్ రాజు గారికి ఎందుకు లాంచ్ చేయాలని అనిపించిందో నాకు తెలియదు కానీ ఇది లక్షలాది మందికి ఒక హోప్ ని ఇచ్చింది. ఆపర్చునిటీ గురించి చూస్తున్న ప్రతి ఒక్కరికి నా బెస్ట్ విషెస్. అప్లై చేసిన ప్రతి ఒక్కరికి బెస్ట్ ఆఫ్ లక్. ఇందులో ఒక్కరి కల నెరవేరినా ఈ వెబ్సైట్ లాంచ్ చేయడానికి న్యాయం జరిగినట్టే. దిల్ రాజు గారు 14 మంది డైరెక్టర్స్ ని లాంచ్ చేశారు. ఈ వేదిక ద్వారా నటీనటులు, దర్శకులు, టెక్నీషియన్స్, ప్రొడ్యూసర్స్ ని లాంచ్ చేయబోతున్నారు. ఐదేళ్ల తర్వాత మీలో కూడా ఎవరో ఒకరు ఇలా స్టేజ్ మీద నిలబడి దిల్ రాజు డ్రీమ్స్ రా తమ డ్రీమ్ ని నెరవేర్చుకున్నామని చెప్తే చాలా ఆనంద పడతాను. ఇంత అద్భుతమైన ప్లాట్ ఫామ్ క్రియేట్ చేసిన దిల్ రాజు గారికి అభినందనలు.అందరికీ థాంక్యు అన్నారు.

రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ.. అందరికీ గుడ్ ఈవెనింగ్. ఇంత మందిని చూడడం చాలా ఆనందంగా ఉంది. ఒక క్రియేషన్ ఒకరి కల. ఆ కలని సాకారం చేసుకోవడానికి సపోర్ట్ చేసేవారికంటే నిరుత్సాహపరిచే వారు ఎక్కువ మంది ఉంటారు. అయితే మన పక్కనున్న వాళ్ళు మనల్ని నిరుత్సాహపరిస్తే మనలో ఒక ఫైర్ రావాలి. ఎంతమంది నిరుత్సాహపరిచినా మీ కలని మీరు నమ్మితే ముందడుగు వేసుకుంటూనే వెళ్ళండి. ఎవరు ఆపలేరు. దానికి




బిగ్గెస్ట్ ఎగ్జాంపుల్ దిల్ రాజు గారు, శిరీష్ గారు విజయ్ దేవరకొండ.. మన కలని మన లక్ష్యాన్ని మనమే నమ్మాలి. మీ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. రాజుగారంటే మాకు ఫ్యామిలీ. ఆయన నాకు పెద్దన్నయ్య లాంటివారు. దిల్ రాజు డ్రీమ్స్ అనేది ఒక అద్భుతమైన వేదిక. యాక్టర్స్ డైరెక్టర్స్ టెక్నీషియన్స్ తో పాటు ప్రొడ్యూసర్స్ కూడా ఒక కాలమ్ కేటాయించడం గొప్ప విషయం. ఇలాంటి వెబ్సైట్ నేను ఇదివరకు ఎక్కడ చూడలేదు. గొప్ప ప్రొడక్షన్ హౌస్ ఈ వెబ్సైట్ ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది మీ అందరికీ ఒక గొప్ప ఫ్లాట్ ఫామ్. సక్సెస్ అనేది మన అల్టిమేట్ టార్గెట్ గా పెట్టుకోవాలి. అలా పెట్టుకుంటే లైఫ్లో డల్ మూమెంట్ అనేది ఉండదు. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్'అన్నారు


ప్రొడ్యూసర్ శిరీష్ మాట్లాడుతూ... అందరికి నమస్కారం. ఇంతమందిని ఆశీర్వదించడానికి వచ్చిన దేవి శ్రీ ప్రసాద్ గారికి, విజయ్ దేవరకొండకి థాంక్యూ. ఇక్కడికి ఎంతోమంది టాలెంట్ ఉన్న వాళ్ళు వచ్చారు. మీ ట్యాలెంట్ తో ఎదిగిన తర్వాత ఇండస్ట్రీని మర్చిపోవద్దు. ఇది ప్రామిస్ చేసి ఎంటర్ అవ్వండి. మీరు సక్సెస్ అవుతారు. థాంక్యూ'అన్నారు.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. విజయ్, దేవి థాంక్యూ. ఆర్య నుంచి దేవితో నాకు జర్నీ ఉంది. ఒక సక్సెస్ఫుల్ ఆల్బమ్ చేయడానికి దేవి ఎంత కష్టపడతాడో నాకు తెలుసు. అలాగే విజయ్ దేవరకొండ ఒక చిన్న క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా జర్నీ మొదలుపెట్టి ఈరోజు ఒక కింగ్డమ్ క్రియేట్ చేస్తున్నాడు. వాళ్ళిద్దరూ ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ మీద దిల్ సినిమా తర్వాత ఎంతోమంది కొత్త దర్శకుల్ని లాంచ్ చేసాం. వాళ్ళు ఈరోజు సక్సెస్ఫుల్ డైరెక్టర్స్ గా ఇండస్ట్రీలో ఉన్నారు. ఈరోజు ఈ స్థాయిలో ఉన్నామంటే ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ముందుకు వచ్చాం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో 57 సినిమాలు పూర్తయ్యాయి. నేను శిరీష్ కథ విని బాగుందన్న తర్వాతనే స్క్రిప్ట్ నెక్స్ట్ లెవెల్ కి వెళుతుంది. అలానే 57 సినిమాలు పూర్తి చేశాం. హర్షిత్ హన్సిత దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్ పెట్టి బలగం వేణు తో పాటు నలుగురు కొత్త దర్శకుల్ని పరిచయం చేశారు. వాళ్లు కూడా కొత్త దర్శకులతో అన్ని రకాల సినిమాలు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్త దర్శకులు కొత్త నిర్మాతలు ఆర్టిస్టులు టెక్నీషియన్స్ ఇండస్ట్రీ ఇండస్ట్రీలోకి రావాలని ఉంటుంది. వాళ్లకి సరైన గైడెన్స్ ఉండదు. అలాంటప్పుడు ఏం చేస్తే బాగుంటుందని వచ్చిన ఆలోచన ఈ దిల్ రాజు డ్రీమ్స్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ మీద భారీ సినిమాలు తీస్తున్నాం. దిల్ రాజ్ ప్రొడక్షన్ పై కొత్త దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. కొత్త టాలెంట్ కోసం ఒక కొత్త టీంని ఏర్పాటు చేసినప్పుడే సినిమా ఇండస్ట్రీలోకి రావాలనుకునే వారికి సరైన వేదిక అవుతుందని ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. దిల్ డ్రీమ్స్ సంస్థని ఒక యంగ్ జనరేషన్ టీం తో ఫామ్ చేసాము. చాలామంది నిర్మాతలుగా రావాలనుకుంటారు. వాళ్ళు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు గాని సినిమాని ఎలా మొదల పెట్టాలి ఎలా కంప్లీట్ చేయాలో క్లారిటీ ఉండదు. కొంతమంది సినిమా తీశాము వీడియో చూడండి అని చూపిస్తుంటారు. సినిమా తీయడం ముఖ్యం కాదు సినిమాని తీసి ప్రేక్షకులు దగ్గరికి తీసుకెళ్లడం పెద్ద టాస్క్, అందరికీ సినిమాల్లోకి రావాలని పాషన్ వుంది. కానీ రైట్ ఫ్లాట్ ఫామ్ వాళ్లకి దొరకదు. అలాంటి రైట్ ఫ్లాట్ ఫామ్ ని క్రియేట్ చేయడానికి దిల్ రాజు డ్రీమ్స్ వెబ్సైట్ లాంచ్ చేస్తున్నాం. దాదాపు 2000 మంది ఈవెంట్ కి వచ్చారంటే మీలో ఎంతమందికి సినిమా పైన పాషన్ ఉందో అర్థం అవుతుంది. మేము ఇక్కడికి రావడానికి 30 ఏళ్లు పట్టింది. కానీ సినిమాలోకి రావడం ఇక్కడ రాణించడం అంత ఈజీ కాదు. వందమంది దర్శకులు కావాలని ప్రయత్నిస్తే అందులో ఐదు మందికి ఛాన్స్ వస్తుంది.ఒకరు హిట్ సినిమా తీస్తారు. అంటే ఇక్కడ సక్సెస్ అనేది 1%. అది మీరు దృష్టిలో పెట్టుకోవాలి. సినిమా కోసం మీరు చేస్తున్న వర్క్ ని విడిచిపెట్టకండి. మేము కూడా అలానే చేసాము. సినిమాలో సక్సెస్ అయ్యేవరకు మేము చేస్తున్న ఆటోమొబైల్స్ బిజినెస్ ని వదులుకోలేదు. ఎందుకంటే ఇక్కడ ఫెయిల్ అయితే మళ్లీ వెనక్కి వెళ్లి పనిచే బిజినెస్ చేసుకోవాలి. సినిమా వల్ల మన ఫ్యామిలీ ఎఫెక్ట్ అవ్వకూడదు. మేము కూడా ఇక్కడ స్ట్రగుల్స్ పడ్డాం. అయితే వదలకుండా ప్రయత్నించాం. సాధించాం. నిజానికి సినిమా ఇండస్ట్రీలో మనం రాణించగలుగుతామా లేదా అనేది మీకే తెలియాలి. మీపై మీకు నమ్మకం ఉండాలి. సినిమా అనేది ఒక అట్రాక్షన్. అది లాగుతుంటుంది. జీవితాలు మీద ఇంపాక్ట్ పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే. ఎప్పుడైతే మీరు సినిమాలో సక్సెస్ అవుతున్నారని మీకు అర్థం అవుతుందో అప్పుడు మీరు 24 గంటలు కష్టపడాలి. మేము విజయ్ దేవి నాని ఇలా అందరూ ఇండిపెండెంట్ గా సక్సెస్ అయి వచ్చిన వాళ్ళమే. అంతకుముందు జనరేషన్ లో చిరంజీవి గారు రజనీకాంత్ గారు అందరూ కూడా ఇండిపెండెంట్ గానే సక్సెస్ సాధించారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. సినిమా అంటేనే హార్డ్ వర్క్ . దిల్ రాజు డ్రీమ్స్ ద్వారా మేము ఒక ఫ్లాట్ ఫామ్ క్రియేట్ చేస్తున్నాం. దీనికి మీరు అప్లికేషన్స్ ఇవ్వచ్చు. దానిలో టీమ్ స్క్రూటినీ చేసి మెజారిటీ పీపుల్ లైక్ చేసిన తర్వాత మా దగ్గర పంపిస్తారు. మేము టైం స్పెండ్ చేసి దాన్ని ఓకే చేస్తాము. కానీ చాలామంది రిజెక్ట్ అవ్వచ్చు. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు. మీలో కాన్ఫిడెన్స్ ని దృష్టిలో పెట్టుకొని మీరు ప్రయత్నిస్తూనే ఉండాలి. అప్పుడే సక్సెస్ వస్తుంది. దిల్ రాజు డ్రీమ్స్ లో ఒక ప్రొడ్యూసర్ కాలమ్ కూడా పెడుతున్నాం. సినిమా గురించి మా టీం అనాలిసిస్ చేసి చెప్తారు. సినిమా ఇండస్ట్రీలో చాలా మోసాలు ఉంటాయి. అన్నిటి మీద అవగాహనతో ముందుకు రావాలి. ఈవెంట్ కి రావడానికి పదివేల రిజిస్ట్రేషన్ వచ్చాయి. వరల్డ్ వైడ్ గా లక్ష నుంచి రెండు లక్షల మంది సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఈ ప్లాట్ ఫామ్ ని వాడుకోవడానికి సిద్ధంగా ఉన్నారని నాకు అర్థం అవుతుంది. అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్'అన్నారు

## రామ్ పోతినేని, ఉపేంద్ర, మహేష్ బాబు పి, మైత్రి మూవీ మేకర్స్ 'ఆంధ్రా కింగ్ తాలూకా' కొత్త షూటింగ్ షెడ్యూల్ రాజమండ్రిలో ప్రారంభం

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా, మహేష్ బాబు పి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది.

తాజా షూటింగ్ షెడ్యూల్ ఈరోజు రాజమండ్రిలో ప్రారంభమైంది. రామ్ పోతినే, కన్నడ స్టార్ ఉపేంద్రలపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ ఆసక్తికరమైన కథాంశంలో రామ్ డై హార్డ్ అభిమాని పాత్రను పోషిస్తుండగా, ఉపేంద్ర సూపర్ స్టార్ గా పాత్రలో కనిపిస్తారు. ఇటీవల విడుదలైన 'ఆంధ్రా కింగ్ తాలూకా' టైటిల్ గ్లింప్స్



కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన వచ్చింది.

లేటెస్ట్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే రామ్ సరసన కథానాయికగా నటిస్తోంది. టాప్ టెక్నిషియన్స్ తో ఈ ప్రాజెక్ట్ అత్యున్నత స్థాయి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. సిద్ధార్థ నుని సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. వివేక్-మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా.

ట్యాలెంటెడ్ స్టార్ కాస్ట్, అద్భుతమైన కథాంశం, హై ప్రొడక్షన్ వాల్యూస్ తో 'ఆంధ్ర కింగ్ తాలూకా' ఒక అద్భుతమైన ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది



## నరేష్ అగస్త్య, విపిన్, ఉమా దేవి కోట, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' జూలై 17న గ్రాండ్ రిలీజ్

యంగ్ హీరో నరేష్ అగస్త్య, దర్శకుడు విపిన్ దర్శకత్వంలో, సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై ఉమా దేవి కోట నిర్మించిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. చిత్రంలో రబియా ఖతూన్ కథానాయిక. ఇప్పటికే రిలీజ్ అయిన రెండు టీజర్లు, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. జూలై 17న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. హీరో నరేష్ అగస్త్యతో పాటు ప్రధాన నటులంతా కనిపించిన రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ పోస్టర్ చాలా ప్లజెంట్ గా వుంది. జస్టిన్ ప్రభాకరన్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. మోహన కృష్ణ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, తోట తరణి ఆర్ట్ డైరెక్టర్ కాగా మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్. 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' ఆడియన్స్ కి మంచి థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది.

## తరుణ్ భాస్కర్, ఎస్ ఒరిజినల్స్, సురేష్ ప్రొడక్షన్స్, కల్ట్ సీక్వెల్ 'ENE రిపీట్' అనౌన్స్‌మెంట్

'ఈ నగరానికి ఏమైంది' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులని, ముఖ్యంగా యువతను ఆకట్టుకుని సంచలనాత్మక విజయం సాధించి కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. సినిమా రీరిలిజ్ మరింత ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేసింది. సినిమాలో పాత్రలు, హ్యూమర్, లైఫ్ కి కనెక్ట్ అయ్యే కథతో ఈ చిత్రం మ్యాసీవ్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇప్పుడు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ అధికారికంగా అనౌన్స్ చేశారు. ENE రిపీట్ టైటిల్ తో ఈ ప్రాజెక్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మళ్ళీ అదరగొట్టబోతోందనే హామీ ఇస్తోంది. దాదాపు ఒరిజినల్ స్టార్ కాస్ట్, టెక్నికల్ టీం తో తిరిగి వస్తున్న ఈ సీక్వెల్ నోస్టాల్జియా ఫీలింగ్ ని కలిగిస్తుంది.

ఫస్ట్ పార్ట్ లో అందరినీ అలరించిన గ్యాంగ్ విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను మరోసారి మ్యాడ్‌నెస్ క్రియేట్ చేయబోతున్నారు. ఒరిజినల్ ని క్రియేట్ చేసిన క్రియేటివ్ పవర్ హౌస్ తరుణ్ భాస్కర్ ఈ సీక్వెల్ కు దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ ఒరిజినల్స్, సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ల పై డి. సురేష్ బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మిస్తున్నారు.

టైటిల్ అనౌన్స్‌మెంట్ కూడా ఒక హిలేరియస్ ట్రీట్ లా వుంది. ఈ



మూవీ టైటిల్ ENE రిపీట్. ఇది మరో యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ని ప్రామిస్ చేస్తోంది. టైటిల్ లోగో తెలుగు లెటర్స్ ని తెలివిగా మిక్స్ చేస్తోంది. ఇక్కడ ENE యొక్క మొదటి, చివరి అక్షరాలు తెలుగులో కనిపిస్తాయి, చివరి అక్షరాలు తిప్పబడి మూవీ ఆఫ్‌బీట్ టోన్‌ను ప్రజెంట్ చేస్తున్నాయి.

ఏలనాటి శని పోయింది, కన్యారాశి టైమ్ ఒచ్చింది అనే ట్యాగ్‌లైన్, గాలిలో ఎగిరిపోతున్న బట్టలు, బ్రీఫ్‌కేస్, బీర్ బాటిళ్లు, సన్ గ్లాసెస్, విమాన టికెట్ ఇవన్నీ ఆకాశమంత సాహసాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఇది కేవలం కొనసాగింపునే కాదు, మ్యాడ్ నెస్ ని మరింత పెంచుతుంది. ఎంటర్ టైన్మెంట్, ఎనర్జీని రెట్టింపు చేస్తుందని హామీ ఇస్తుంది.

ఈ సీక్వెల్ ట్యాలెంటెడ్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ఒరిజినల్ కంపోజర్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తు సిరీస్ సిగ్నేచర్ వైబ్‌ను కొనసాగిస్తున్నారు. AJ ఆరోన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, రవితేజ గిరిజాల ఎడిటర్. సౌమిత్రి ఎన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తి స్థాయిలో జరుగుతోంది.

## హరిహరవీరమల్లు ఆలస్యం.. అభిమానుల్లో అసహనం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం పై అభిమానులు ఏ స్థాయిలో ఆశలు పెట్టుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆ అంచనాలకు మేకర్స్



అనుగుణంగా స్పందించకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఇప్పటికే చాలా కాలం క్రితమే షూటింగ్ పూర్తి అయినప్పటికీ, చిత్ర బృందం నుంచి సరైన అప్డేట్స్ లేకపోవడం అభిమానులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ వారం ట్రైలర్‌కు సంబంధించి అప్డేట్ వస్తుందని ప్రకటించినప్పటికీ, అది ఇప్పటివరకు విడుదల కాలేదు. వారం ముగియబోతున్నా కూడా కనీసం ఒక టీజర్, పోస్టర్, గ్లింప్స్ లాంటి ఏదైనా చిన్న హింట్ ఇవ్వకుండా, పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవడం వలన ఫ్యాన్స్ నిరాశకు లోనవుతు న్నారు. దీంతొ చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కూడా ప్రమోషన్ పరంగా ఏమీ చేయకపోవడాన్ని అభిమానులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సినిమా రిలీజ్‌ను మళ్లీ మళ్లీ వాయిదా వేయడమే కాదు, ఇప్పుడు ట్రైలర్ అప్డేట్స్ విషయంలో కూడా అజాగ్రత్తగా వ్యవహరించడం అభిమానులకు నిజమైన 'వర్స్ట్ ఎక్స్‌పీరియన్స్'గా మారుతోంది. ఇప్పటికే సినిమా ఎన్నోసారి వాయిదా పడింది. పవన్ కళ్యాణ్ షూటింగ్ పూర్తి చేసినప్పటికీ సినిమా విడుదలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, దానికి తోడు తాజా ట్రైలర్ అప్డేట్ విషయంలోనూ స్పష్టత లేకుండా మేకర్స్ వ్యవహరించడం వల్ల ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. మొత్తంగా చూస్తే, 'హరిహర వీరమల్లు'పై ఉన్న హైప్‌ను సద్వినియోగం చేసుకోవడంలో చిత్రబృందం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. ఎంత భారీ బ్జడెట్, స్టార్ కాస్ట్ ఉన్నా.. ఇలా అప్డేట్‌లు లేకుండా డిజప్పాయింట్ చేయడం అభిమానులకు నిజంగా బాధ కలిగించే విషయం.

## నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల, సుధాకర్ చెరుకూరి, SLV సినిమాస్ 'ది పారడైజ్'- హైదరాబాద్‌లో 40 రోజుల ఎక్స్‌టెన్సివ్ షెడ్యూల్‌లో జాయిన్ అయిన నాని- మార్చి 26, 2026న థియేటర్స్ లో రిలీజ్

నేచురల్ స్టార్ నాని తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్'లో అడుగుపెట్టారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం కోసం మరోసారి చేతులు కలిశారు. జూన్ 21న షూటింగ్ ప్రారంభమైంది. నాని ఈరోజు సెట్స్‌లో అడుగుపెట్టారు. వారం పాటు సాగిన కీలకమైన చైల్డ్ వుడ్ సన్నివేశాల షూటింగ్ తో సినిమా జర్నీ ప్రారంభమైంది. ఇప్పుడు నాని ఎంట్రీ ఇచ్చారు. "ధగడ్ ఆగయా!" అంటూ అమెజింగ్ అనౌన్స్‌మెంట్‌తో లుక్ రిలీజ్ చేశారు. బరువైన బార్బెల్ వెయిట్స్‌పై నాని కాలు మాత్రమే కనిపించే పోస్టర్‌లో 'ఈసారి నాని మరింత ఫెరోషియస్ వస్తున్నాడు'అనే క్యాప్షన్ ఆకట్టుకుంది.



ఈ 40 రోజుల హైదరాబాద్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంతో కూడిన పవర్‌ఫుల్ సన్నివేశాలు షూట్ చేయనున్నారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన గ్రాండ్ సెట్స్‌లో షూటింగ్ జరగనుంది. 'దసరా' సినిమా పాన్ ఇండియా అదరగొట్టింది. 'ది పారడైజ్' గ్లోబల్ లెవెల్‌కు వెళ్లబోతోంది. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ 8 భాషలలో విడుదల కానుంది. టైటిల్ పోస్టర్, గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. ముఖ్యంగా గ్లింప్స్‌లో ఉన్న పవర్‌ఫుల్ డైలాగ్, విజువల్స్, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్, నాని స్ట్రాంగ్ ఎంట్రీ... ఇవన్నీ సినిమా పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి.మార్చి 26, 2026న 'ది పారడైజ్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ మరోసారి అనౌన్స్ చేశారు.

## ఆయన కళ్ళు చిరంజీవి ఐ బ్యాంక్ కి, భౌతిక కాయం అపోలో ఆసుపత్రికి..

చిత్ర పరిశ్రమలో వ్యక్తుల మధ్య అనుబంధాలకు ఆత్మీయతలకు నిదర్శనంగా నిలిచే సంఘటన ఇది. ప్రముఖ నటులు, నిర్మాత మురళీమోహన్ గారితో ఐదు దశాబ్దాల అనుబంధం కలిగి, ఆయన జయభేరి రియల్ ఎస్టేట్ సంస్థలో సైట్ మేనేజర్ గా పనిచేస్తున్న కొల్లి వీర ప్రకాశరావు(84) ఈరోజు మరణించారు. ఈయన మురళీమోహన్ గారి పర్సనల్ మేకప్ మెన్ అయిన కొల్లి రాము గారి అన్నయ్య. మురళీమోహన్ హీరోగా పరిచయమైన "జగమే మాయ" చిత్రానికి మేకప్ డిపార్ట్మెంట్ లో అప్రెంటిస్ గా చేరిన కొల్లి రాము గత 50 ఏళ్లకు పైగా ఆయన వద్దే పనిచేస్తున్నారు. ఆ అనుబంధంతోనే రాము అన్నయ్య వీరప్రకాశరావుకు తమ జయభేరి రియల్ ఎస్టేట్ లో సైట్



మేనేజర్ గా ఉద్యోగం ఇచ్చారు మురళీ మోహన్. ఈయన కుమారుడు దుర్గాప్రసాద్ చిత్ర పరిశ్రమలో కెమెరామెన్ గా స్థిరపడ్డారు. ఇటీవల కామెడీ హీరో ధనరాజ్ దర్శకత్వంలో విడుదలైన "రామం రాఘవం" చిత్రానికి దుర్గాప్రసాద్ కెమెరామెన్ గా పనిచేశారు . కాగా వీర ప్రకాశరావు కళ్ళను" చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంకుకు , భౌతిక కాయాన్ని అపోలో ఆసుపత్రికి డొనేట్ చేశారు. ఇటీవలే మరణించిన వీరి అక్కయ్య కళ్ళను, భౌతిక కాయాన్ని కూడా ఇలాగే డొనేట్ చేయటం ఆ కుటుంబ సభ్యుల సామాజిక బాధ్యతకు నిదర్శనంగా చెప్పుకోవాలి . కాగా తనతో, తమ జయభేరి సంస్థతో సుదీర్ఘ అనుబంధం కలిగిన వీర ప్రకాశరావు మృతి పట్ల మురళీమోహన్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.



Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756